

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 230 | ది. 17-11-2024 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## షిండే, అజిత్ గుజరాత్ గులాంలు

● చంద్రాపూర్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

**నాగ్ పూర్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** మహారాష్ట్రలో ప్రజా తీర్పును ఏక్ నాథ్ షిండే, అజిత్ పవార్ కాలరాశారని, వారిద్దరూ గుజరాత్ గులాంలుగా మారారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహా రాష్ట్ర చంద్రాపూర్ నియోజవర్గం గుగ్గూస్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్ర భుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ఏడాది కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చా మని చెప్పారు. ఈ దేశంలో గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. చంద్రాపూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ పడ్ వేకర్ ను 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రవీణ్ ను గెలిపిస్తే మీకు ఇక్కడ ఒక అన్న హైదరాబాద్ లో మరో అన్నగా తాను ఉంటానన్నారు.

# చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతి







**హైదరాబాద్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1994లో టీడీపీ నుంచి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఏపీ మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని శనివారం ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం చంద్రబాబు మహారాష్ట్ర పర్యటన రద్దు చేసుకుని హైదరాబాద్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. ఆదివారం నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**తమ్ముడి ఆత్మకు శాంతి కలగాలి: చంద్రబాబు..** "నా తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో తెలియజేస్తున్నాను. రామ్మూర్తి నాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. మా నుంచి దూరమై మా కుటుంబంలో ఎంతో విషాదాన్ని నింపాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

**సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం..** మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

**పిన్ని.. తమ్ముళ్లు ధైర్యంగా ఉండాలి: లోకేశ్..** "చిన్నాన్న రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర విషాదం నింపింది. ఆయనతో నా చిన్ననాటి అనుబంధం కళ్ల ముందు కదలాడుతోంది. కన్నీటితో నివాళులు అర్పిస్తున్నా. ఇన్నాళ్లూ ఆయన మాకు కనిపించే ధైర్యం.. ఇకపై చిరకాల జ్ఞాపకం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. అంతులేని దుఃఖంలో ఉన్న నా సోదరులు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నా".

**రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలి - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్** "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణించారని తెలిసి చింతిస్తున్నా. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలి. సోదర వియోగంతో బాధపడుతున్న సీఎం చంద్రబాబుకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉండటంతో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నా. రామ్మూర్తి నాయుడు కుమారుడు రోహిత్, కుటుంబసభ్యులకు నా సంతాపం తెలుపుతున్నా అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందేశంలో తెలిపారు.

**రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి సంతాపం ..** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు అకాల మరణం దిగ్భ్రాంతి కలిగించింది. వారే కుటుంబ సభ్యులకు పార్టీ నేతలకు మా సంతాపం తెలియచేస్తున్నాము. తెలుగు దేశంలో కీలక నేతగా పార్టీని ప్రజలకు చేరువ చేసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. చిన్న వయస్సులోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి పార్టీ నేతగా, ఎమ్మెల్యేగా తనదైన ముద్ర వేశారు. నిస్వార్థంగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయనీ మంత్రి పార్థసారథి నివాళులర్పించారు.

# మహారాష్ట్ర నుంచి విచ్ఛిన్నకర శక్తులను పారదోలండి...

● దేశ సమగ్ర అభివృద్ధిలో మహారాష్ట్ర పాత్ర కీలకం ● డేగ్లూర్, నాందేడ్ అభివృద్ధి కోసం ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించండి ● మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





**అమరావతి,నవంబర్ 16 (వార్తాప్రభ) :** 'మహారాష్ట్ర చరిత్రలో ఎంతోమంది మహానుభావులు సనాతన ధర్మ పరిరక్షణ కోసం కృషి చేశారు. ఆ మహనీయుల స్ఫూర్తికి కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ఆటంకాలు కలిగిస్తున్నాయి. ప్రజలను విభజించి పాలించే అలాంటి పాలకులను తరిమికొట్టాలి. సనాతన ధర్మ పరిరక్షణ కోసం.. దేశ సమగ్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వానికి యువత, మహిళలు, మహారాష్ట్ర ప్రజలు మద్దతు పలకాలి. మరాఠా గడ్డపై ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిని నిలబెట్టాల'ని జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. శనివారం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా డేగ్లూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి జితేశ్‌రావ్ సాహెబ్ అంతాపుర్కార్ కుటుంబ సభ్యులు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం బహిరంగ సభలో జనవాహినిని ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, నేను ఇక్కడికి కేవలం ఓట్లు అడగడానికి రాలేదు. ఎందరో మహనీయులు పుట్టిన నేల.. ఎందరో సాధువులు నడిచిన నేల.. మహానుభావులు ఉన్న నేల మీద గౌరవం తెలపడానికి వచ్చాను అన్నారు. 2028 లోపు మహారాష్ట్రను రూ. లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే క్రమంలో ఎన్నో గొప్ప అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. భారత దేశాన్ని ఐదు లక్షల ట్రిలియన్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మహారాష్ట్ర కీలకపాత్ర పోషించబోతోంది. ఇలాంటి సమయంలో డేగ్లూర్ నియోజకర్గ అభివృద్ధి చాలా కీలకం. ఎన్డీఏ ప్రభుత్వం ఇక్కడ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. డేగ్లూర్ లో ప్రభుత్వ విశ్రాంతి గృహం, డేగ్లూర్, బిలోలీల్లో పోలీస్ స్టేషన్లు, కోర్టుల నిర్మాణం, హేమంత్ పంత్ ఆలయ అభివృద్ధి, కుందల్ వాడీ బేవలీ రోడ్డు మార్గం నిర్మాణాలను పూర్తి చేసింది. హర్ ఘర్ జల్ యోజన కింద 50 శాతం పనులు పూర్తయ్యాయి. డేగ్లూర్ నియోజకవర్గంలో ఇదే వేగంతో అభివృద్ధి కొనసాగాలంటే, మహారాష్ట్రను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలి. మీ కలలన్నీ సాకారం కావాలి అంటే ఎన్డీఏకు డేగ్లూర్ యువత, ఆడబిడ్డలు ప్రజల మద్దతు కావాలని కోరారు. ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఐదు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం 175 స్థానాలకు 164 స్థానాలు గెలిచి అద్భుత విజయం సాధించింది. గెలిచిన వెంటనే పింఛన్లు రూ. 4 వేలకు పెంచింది. మెగా డీఎస్సీ ప్రకటించింది. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేశారు. రూ. 4,500 కోట్ల ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రహదారులు నిర్మిస్తున్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని గాలికొదిలేసిందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మాత్రమే ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, బీజేపీ జాతీయ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాందేడ్ పార్లమెంటు, డేగ్లూర్ అసెంబ్లీల బరిలో ఉన్న అభ్యర్థులు, నాందేడ్ జిల్లా మహాయుతి నాయకులు పాల్గొన్నారు.

## రాబోయే 5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు - రాష్ట్ర బీసీ శాఖ మంత్రి సవిత



**గుంటూరు,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రానున్న అయిదేళ్ల కాలంలో 20 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి డీఎస్సీ నిర్వహణ పూర్తయి, అపాయింట్ మెంట్ ఆర్డర్లతో నూతన ఉపాధ్యాయు బాధ్యతల్లో చేరడం ఖాయమని స్పష్టంచేశారు. వచ్చే నెల నుంచి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ కోచింగ్ ప్రారంభించనున్నామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ను గుంటూరు కలెక్టరేట్లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో ఎమ్మెల్యే మహ్మద్ నజీర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఏసురత్నంతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై చేశారన్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో తన సంతకం కూడా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటు ఫైల్ సంతకం చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా గుంటూరు డీఎస్సీ కోచింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు నెలల పాటు ఈ శిక్షణా తరగతుల కొనసాగనున్నాయన్నారు. అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టయిఫండ్ తోపాటు రూ. 1000లు పుస్తకాల కొనుగోలుకు అందజేయనున్నామన్నారు. రాబోయే అయిదేళ్లలో 20 లక్షల మంది యువతీ యువకులకు 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా మంత్రి నారా లోకేశ్...రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశ విదేశాల్లో కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతున్నారు.

## తీరుమార్చుకోని కంపెనీల అనుమతులు రద్దు చేస్తాం: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఇందుకోసం కావాల్సిన అన్ని రకాల చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పామాయిల్ కంపెనీల పురోగతిపై మంత్రి సమీక్షించారు. పురోగతి చూపించని ఆయిల్ కంపెనీలపై అసహనం వ్యక్తం చేశారు. తీరుమార్చుకోని కంపెనీల అనుమతులు రద్దు చేసి, టీజీ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తామన్నారు. 2025 చివరి నాటికి ప్రతి కంపెనీ వారికి కేటాయించిన జోన్లలో ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఇప్పటికే 64,040 హెక్టార్లలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేసినట్లు చెప్పారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా ఇప్పటివరకు 25,470 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసుకున్నాం.

# ఆహా పత్రికల ప్రదర్శన ఉందా....

● ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఐ&పీఆర్ మంత్రి

● అయితే కచ్చితంగా వస్తా.. ● వాస్తవాలు తెలుసుకుంటాం..

● పత్రికా సంపాదకులతో మంత్రి కొలుసు పార్థ సారథి ..



**అమరావతి,నవంబర్ 16 (వార్తాప్రభ) :** అదేమిటీ పత్రికల ప్రదర్శన నా ..గతంలో ఎన్నడూ వినలేదు. చూడ లేదనుకుంటా...అయితే అదేమిటో చూస్తా... అన్ని వివరాలు తెలుసుకుంటానని సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.సచివాలయంలో ని మంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రస్థాయి పత్రికల ఎడిటర్స్ ఆత్మీయ సమావేశం ఈ నెల 24వతేదిన విజయవాడ గాంధీనగర్ గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా రావాలని మంత్రిని కోరగా ఆయన స్పందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోశించదగ్గ విషయమని ఆయన కొనియాడారు.సమావేశాలు నిర్వహించి ఏదో ఒక కొత్త మార్పు దిశగా అడుగులు వేయడం, ఆది కూడా పత్రికల ప్రదర్శన అనేది కొత్త అంశమని తప్పక హాజరై, నిశితంగా పరిశీలించి తాము ఏ విదంగా పత్రికలకు అండగా ఉండాలో చూస్తామని మంత్రి పార్థ సారధి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూర్మ ప్రసాద్ బాబు,ప్రధాన కార్యదర్శి రామమోహన్ రెడ్డి,సీనియర్ పాత్రికేయులు శ్రీరామ్ యాదవ్,గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కోగృహాల అభివృద్ధిని అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే వెనిగండ్ల






**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివసించే ప్రజలు పడే బాధలను మొట్టమొదటిగా అసెంబ్లీ సమావేశాల్లో శాసనసభ్యులు వెనిగండ్ల రాము శనివారం ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీలో తొలిసారిగా మాట్లాడే అవకాశం కల్పించిన ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు సియం చంద్రబాబు, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. టిడ్కో ప్రాజెక్ట్ మంజూరు చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పరపు వెంకయ్యనాయుడు గుడివాడ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశామన్నారు. గత 20 ఏళ్ళుగా గుడివాడ సర్వనాశనమైందని.. రాష్ట్రంలో అత్యధికంగా టిడిపి ప్రభుత్వ హయాంలో 8,922 ప్లాట్లు నిర్మాణం పనులు గుడివాడలోనే 80 శాతం పూర్తయ్యాయన్నారు. టిడ్కో కాలనీలో మిగిలిన 20శాతం పనులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కాలనీలో కనీస మౌలిక వసతులను కూడా గత పాలకులు ఏర్పాటు చేయలేదన్నారు. కాలనీ ఏర్పాటుకు ఏమాత్రం సంబంధం లేని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్లాట్ల పంపిణీ చేయడం జరిగిందన్నారు. మజ్జిగ పంపిణీకి 28లక్షలు ఖర్చు చేశారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవాలన్నారు. టిడ్కో కాలనీలో ప్రస్తుతం 3,800 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని వారికి మంచినీరు, పారిశుధ్యం వంటి కనీస వసతులు ఏర్పాట్లు చేయడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అవసరాలను తీర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు వైద్య నిర్మాణాలు చేపట్టాలని ప్రత్యేకంగా త్రాగునీరు కోసం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# టీఏ బిల్లులు ఇవ్వండి మహాప్రభో...!

## రెండేళ్లుగా ఆర్టీసీ సిబ్బంది ఎదురు చూపులు....




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో స్క్వాడ్ (తనిఖీ-విజిలెన్స్)విభాగంలో పనిచేస్తు న్న ఉద్యోగులు తమ విధులను భారం గా నిర్వహించాల్సి వస్తోంది. వారంలో ఐదురోజులపాటు విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న వీరికి మామూలుగా ఉద్యోగులతోపాటుగా జీతాలు చెల్లిస్తుండగా వీరు నిర్వహించే విధులు మాత్రం అసాధారణంగానే ఉంటున్నాయి.



**విజయవాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** డ్యూటీలో ఉన్న ఐదురోజులపాటు ఇంటికి వెళ్లకూడదనే నిబంధన ఉంది. ఇంటి నుంచి భోజనాలు తెచ్చుకోకూడ దనే షరతులు కూడా ఉన్నాయి.ఇలా ఐదురోజులపాటు ఫీల్డ్ విధుల్లో ఉంటున్న వీరికి ప్రభుత్వం నుంచి ట్రావెలింగ్ అలవెన్స్ (టిఏ) బిల్లులు మంజూరు చేయటంలేదు.మిగతా ప్రభుత్వ విభాగాలతోపాటుగా ఆర్టీసీలో అనేక విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వారికి టిఏ బిల్లులు ఇస్తుండగా, విజిలెన్స్ విభాగంలో ఉన్న వారికి మాత్రం ఇవి వర్తించటంలేదు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకముందు తనిఖీ విభాగంలో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా జీతంతోపాటు టిఏ బిల్లులు ఇచ్చేవారు. ఇందులో ఎన్ఒ, డిఒ, ఆర్ఆర్ఏ పేరుతో ఇచ్చేవారు.విలీనాని కి ముందు పనిచేసే సిబ్బందికి ప్రతినెలా జీతంతోపాటు క్లెయిమ్ చేస్తే సిబ్బంది హోదాని బట్టి సుమారు రూ.4000 నుంచి రూ.8000 వరకూ వచ్చేది. 2022 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనప్పటినుంచి అంటే రెండేళ్లుగా టిఏ బిల్లులు తనిఖీ సిబ్బంది ఎవ్వరికీ ఇవ్వటంలేదు.దీంతో తనిఖీ విభాగంలో పనిచేసే ప్రతి ఉద్యోగికి సుమారు రోజుకొచ్చి రూ.250 నుంచి రూ.400 వరకూ బయట ఖర్చులు అవుతున్నా యి.ఈ లెక్కన చూస్తే నెలకు రూ.7500 నుంచి రూ.8000 వరకూ అదనంగా సిబ్బంది తమ జీతాల్లో నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.అయితే ప్రతి ఉద్యోగి తమ కుటుంబ అవసరాల కు డబ్బులు సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారు.గత్యంతరం లేని పరిస్థితుల్లో బయట వడ్డీలకు డబ్బులు తెచ్చి కుటుంబాలకు ఖర్చుచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తనిఖీ సిబ్బందికి కూడా అలవెన్సులు మంజూరుచేయా ల్సివుంది.కానీ బడ్జెట్ ప్రాతిపదికనే ఉంటుందనే పేరుతో ప్రభుత్వం అలవెన్సులు మంజూరుచేయటంలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో ఇక్కడ పని చేయలేమనీ,తమను కూడా ఆర్టీసీ డిపో లకు బదిలీ చేయాల్సిందిగా కొందరు తనిఖీ సిబ్బంది కోరుతున్నారంటే పరిస్థితి ఎలాఉందో అర్థం చేసుకోవచ్చు.

### తనిఖీ విభాగంలో ఖాళీల భర్తీ కూడా లేదు :

ఇదిలావుండగా తనిఖీ విభాగంలో పనిచేసే సిబ్బంది ఖాళీలు కూడా వందల్లో ఉన్నాయి.అయినా ఆ ఖాళీలు భర్తీ చేయడం లేదు.ఇన్ని సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలిసి మిగతా సిబ్బంది ఎవరూ కూడా తనిఖీ విభాగంలో పని చేసేందుకు రావటానికి ఇష్టపడటంలేదు.అదే ఆర్టీసీ డిపోల పరిధిలోనైతే డ్యూటీ పూర్తయ్యాక ఇంటి కి వెళ్లచ్చు.కానీ ఇక్కడ డ్యూటీలోకి ఎక్కితే ఐదురోజులపాటు ఎంత అర్జంటు పనులున్నా, కుటుంబ సభ్యు ల్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఉన్నా, శుభ, అశుభ కార్యక్రమాలున్నా విధుల నుంచి బయటకు వెళ్లటానికి వీల్లేదు.రాత్రి, పగలు పనిచేసే వారికి ట్రావెలింగ్ అలవెన్స్, రెస్ట్‌రూమ్ అలవెన్స్, డాక్ ఇంటర్‌స్నేట్ బంగ్లా అలవెన్స్ వంటి సదుపాయాలు కల్పించాల్సివుంది.సూపరింటెండెంట్ కేడర్, డిప్యూటీ సూపరింటెండెంట్, ఎడిసి వంటి విభాగాల్లో పనిచేస్తున్న వారు ఉన్నారు.వీరంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆర్టీసీ ఆదాయానికి గండిపడకుండా చూస్తున్నారు.ప్రతినెలా జీతం వచ్చే సిఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా నిబంధనల ప్రకారం ఆర్టీసీ ఫండ్స్ నుంచి అలవెన్స్ లు ఇవ్వొచ్చుననే జీవో కూడా ఉంది. కానీ ఆర్టీసీ యాజమాన్యం ఇవ్వటం లేదు.ఈ మేరకు ఈ విషయాన్ని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖమంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ని కలిసి తనిఖీ విభాగం సిబ్బంది వినతిపత్రాన్ని సైతం అందజేశారు.కొత్తగా వచ్చిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తమకు టిఏ బిల్లులు మంజూరుచేయాల్సిందిగా తనిఖీ విభాగం సిబ్బంది కోరుతున్నారు.

# క్రైమ్ అండ్ ఫోరెనిక్స్ సైన్సెస్ లో నిష్ణాతత సాధించిన పిన్నిక నాగార్జున యాదవ్



**మార్కాపురం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** హైదరాబాదులోని నల్సార్ యూనివర్సిటీ లో జరిగిన కాన్వగేషన్ ప్రోగ్రాం లో అడ్వాన్స్ డిప్లమా ఇన్ క్రైమ్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ లో తన విద్యను పూర్తిచేసుకుని పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ గౌరవ అలోక్ అరాదే చేతులమీదుగా పిన్నికి నాగార్జున యాదవ్ ఈ అవార్డును అందుకోవడం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పడాల రామారెడ్డి కాలేజ్ ఆఫ్ లో న్యాయవాద విద్యను అభ్యసించి, అటు పిమ్మట పీజీ విద్యను బెంగళూరులోని ప్రసిద్ధ అలయన్స్ యూనివర్సిటీలో పూర్తిచేసి నాగార్జున యాదవ్ ఇప్పటికే ఎల్.ఎల్.ఎం. పట్టాను పొందారు. తర్వాత తన చదువును కొనసాగిస్తూ ప్రఖ్యాత న్యాయ విశ్వవిద్యాలయమైనటు వంటి నల్సార్ యూనివర్సిటీలో క్రైమ్ అండ్ ఫోరానిక్స్ సైన్సెస్ విద్యను అభ్యసించిన నాగార్జున యాదవ్ ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయుచున్నారు. వీరి తండ్రి లక్ష్మీప్రసాద్ యాదవ్ న్యాయవాదిగా పనిచేస్తూ, కొంతకాలంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ గా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరు ప్రముఖ బీసీ, యాదవ సంఘాలలో జాతీయ స్థాయి నాయకులుగా సామాజిక సేవలో ఉన్నారు. నాగార్జున యాదవ్ మాతృమూర్తి జాహ్నవి ప్రియ కాగా వీరు మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా సేవలందిస్తున్నారు.

# ఘనంగా జాతీయ జర్నలిస్టు డే సంబరాలు



**విస్సన్నపేట,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జాతీయ జర్నలిస్టు డే సంబరాలను మండల అధికారుల చేతుల మీదుగా కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఎస్ ఐ రామకృష్ణ, టిడిపి యువ నేతలు మురుగుల ప్రసాద్ ,వెంపటి వేమన తదితరులు పాల్గొనగా కార్యక్రమానికి మేకల కిరణ్ బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా మిత్రులు పాల్గొన్నారు

# రైతు బజారు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**విస్సన్నపేట,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో రైతు బజార్ ఏర్పాటు అందని ద్రాక్ష పరిస్థితి వచ్చిందని సర్వత్ర అనుకుంటున్నారు. పెరుగుతున్న రేట్లు దృష్టిలో ఉంచుకొని రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేయాలని పలు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

# గ్రంథాలయ వ్యవస్థాపకులు ఏవి రమణయ్య కు నివాళులు



**విస్సన్నపేట,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండలకేంద్రం లోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి భాను ఆధ్వర్యం లో గ్రంథాలయ వ్యవస్థాపకులు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రప టానికి జాతీయ గ్రంథాలయ వారోత్సవ ఉత్సవ మహోత్సవ కార్యక్రమాల సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర ఉద్యమంలో గ్రంధాలయాల పాత్ర అనే అంశంపై వ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు గౌతం మల్లికార్జున రావు కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఋషి సంస్కృతిని ప్రసాదించేదే బవురువాక



**పిఠాపురం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ఋషి సంస్కృతిని ప్రసాదించేదే బవురువాక ఆశ్రమం అని పీఠాధిపతి డా.ఉమర్ అలీ షా స్వామి వారు అనుగ్రహ భాషణ చేసారు. పరమ పవిత్రమైన కార్తీక మాసం పుణ్య కాలంలో శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం,బవురువాక ఆశ్రమంలో ఏర్పాటు చేసిన జ్ఞాన చైతన్య సదస్సుకు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీ షా స్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు అహ్మద్ అలీ షా మహబూబ్ పాషా,కబీర్ షా,హుస్సేన్ షా వేదికపై ఆసీనులై ప్రసంగించారు. ఎన్ టివి.ప్రసాద వర్మ కార్యక్రమం నిర్వహించి. వందన సమర్పణ చేశారు.ఉమర్ అలీ షా రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు ద్వారా 100 మంది బవురు వాక నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా స్వామి వారు మాట్లాడుతూ బవురువాక ను ఆంధ్రా కాశ్మీర్ గా అభివర్ణించారు. పచ్చదనంతో నిండిన కొండలు,ఔషధ మొక్కలు ప్రజలకు ఆరోగ్యం చేకూర్చును అన్నారు. వారి తండ్రి అష్టమ పీఠాధిపతి పరబ్రహ్మ మొహియుద్దీన్ బాద్షా వారు నడయాడిన పరమ పవిత్రమైన ఈ ప్రదేశంలో త్వరలో ఒక పుణ్య క్షేత్రంగా తీర్చి దిద్దుతామనీ అన్నారు. వారి తండ్రి ఆధ్వర్యంలో గ్రామస్తులు అందరికీ అన్నదానం,తాగునీటి కోసం నుయ్యి తవ్వి%శీ%చారు అని, నా కాలంలో నేను అనేక మెడికల్ క్యాంపులు, రామాలయం నిర్మాణం, పశువులకు పక్షుల కొరకు చలివేంద్రాలు స్థాపించినట్లు చెప్పారు. వారు సాధన చేసిన పవిత్ర ప్రదేశంలో జకీర్ మందిరం నిర్మించామనీ అన్నారు. వారు వారి సాధన శక్తి ద్వారా అభౌతిక శక్తిని ప్రసాదించు చున్నారు అని అన్నారు. అహ్మద్ అలీ షా మాట్లాడుతూ దేవదారు అనే విశిష్ఠ ఔషదం తయారు చేసి, గ్రామస్తుల ఆరోగ్యం కాపాడారు అని అన్నారు. మహబూబ్ పాషా మాట్లాడుతూ వారి తండ్రి నేర్పిన ప్రార్ధన విశిష్టతను తెలియ చేశారు. కబీర్ షా మాట్లాడుతూ సాధన కు అనుకూలమైన ప్రదేశం అని అన్నారు. హుస్సేన్ షా మాట్లాడుతూ వారి తండ్రి భౌతికం గాను, అభౌతికం గాను గ్రామస్తులకు రక్షణ కల్పించారు.అని అన్నారు.రామ సీతా, తలుపులు అమ్మ పాడిన కీర్తనలు సభికులను అలరించాయి.ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అంగలూరులో అయ్యప్ప స్వామి వారి భారీ పడిపూజా కార్యక్రమాన్ని పోలగాని కోటేశ్వరరావు, అనూష దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన అయ్యప్ప స్వామి వారి భజన కార్యక్రమానికి వేలాదిమంది అయ్యప్ప మాలదారులు విచ్చేసి భిక్షను స్వీకరించారు.
–గుడ్లవల్లేరు,నవంబర్ 16 (వార్తాప్రభ) :

# మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** జిల్లా ఇంచార్జి మంత్రి నారాయణను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ.ఈ సందర్భంగా కాకినాడ రూరల్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు పూర్తి భరోసా

● అధికారులు పటిష్ట సమన్వయంతో క్రియాశీలంగా పనిచేయాలి. ● విజయవాడ డివిజన్ పరిధిలో 45 కొనుగోలు కేంద్రాలు.
● ధాన్యం సేకరణ విధానంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలి. ● విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య



**విజయవాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రైతు శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలులో అధికారులు పటిష్ట సమన్వయంతో క్రియాశీలంగా పనిచేయాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. శనివారం విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో చైతన్య.. ఖరీఫ్ (2024–25) ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాలు, వ్యవసాయం, రెవెన్యూ, మార్కెటింగ్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. పంట కోతలు, ధాన్యం దిగుబడులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సిబ్బందికి శిక్షణ, ధాన్యం రవాణా, మిల్లులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతుల క్షేమాన్ని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్కే) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని.. ఈ కేంద్రాలపై వీఏఏలు వంటి క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మద్దతు ధరలు, ధాన్యం నాణ్యతా ప్రమాణాల గురించి వివరించాలన్నారు. వివరాలతో కూడిన పోస్టర్లను కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. పంట కోతలపై పూర్తి అవగాహన ఉంటుంది కాబట్టి అందుకు తగ్గట్లు ప్రణాళికాయుత ఏర్పాట్లతో కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా పనిచేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది అనేది లేకుండా సేవలందించాలన్నారు. ఒకవేళ ఆర్ఎస్కే ద్వారా కాకుండా ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్మాలనుకుంటే రైతులు ఆ వివరాలను ఆర్ఎస్కేలో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఇలాంటి రైతుల పేరుతో మరొకరు ధాన్యం విక్రయించకుండా దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఈ వివరాలు దోహదం చేస్తాయన్నారు. ఈ విషయంపైనా సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఇటీవల భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఇప్పటికే పరిహారం అందించడం జరిగిందని.. అదే విధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు విజయవాడ డివిజన్ పరిధిలో 45 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 7, విజయవాడ రూరల్లో 15, మైలవరంలో 12, జి.కొండూరులో 10, విజయ వాడ నార్త్ మండలంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో సిబ్బందితో పాటు ఎక్విప్మెంట్, గోనె సంచులు అన్నీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సాధారణ రకం (కామన్) క్వింటాకు రూ. 2,300, 75 కిలోలకు రూ. 1,725 అదేవిధంగా గ్రేడ్–ఎ రకం క్వింటాకు రూ. 2,320, 75 కిలోలకు రూ. 1,740 కనీస మద్దతు ధరగా ఉందని వివరించారు. షెడ్యూలింగ్ ప్రకారం గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని.. ప్రతి కేంద్రంలో రెండు చొప్పున హమాలీ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఒకవేళ రైతే గోనె సంచులుగానీ, హమాలీలుగానీ, రవాణాగానీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఆ సొమ్మును ధాన్యం సొమ్ముతో సహా రైతు ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా ప్రణాళికతో ధాన్యాన్ని రవాణా చేయడం వల్ల అన్లోడింగ్లో జాప్యం జరక్కుండా చూడొచ్చన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసిన 48 గంటల్లో రైతు ఖాతాకి సొమ్ము జమవుతుందని.. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టోడియన్ అధికారులు, టెక్నికల్ సిబ్బంది.. ఇలా ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. రైతుల సహాయార్థం జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం నంబరు (7702003571) అందుబాటులో ఉందని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ తోట వెంకట సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎంవీ ఇన్స్పెక్టర్ ఆర్.ప్రవీణ్తో పాటు తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, సహకార, మార్కెటింగ్ అధికారులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

# మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ఆదేశాలు ఇవ్వాలని అంగన్వాడీల ధర్నా

● 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్



**కాకినాడ, కలక్టరేట్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ ఆదేశాలకు తక్షణమే విడుదల చేయాలని, 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ గారికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతి మాట్లాడుతూ, 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె ముగిసి నేటికీ ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాసి ఇచ్చిన ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్ ను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి, రాష్ట్ర అప్పులను కారణంగా చూపడం మానుకోవాలన్నారు. 300 కుటుంబాలకు మినీ సెంటర్ ఉండాల్సి ఉండగా 1500 కుటుంబాలలో కూడా మినీ సెంటర్లను నిర్వహిస్తూ మినీ వర్కర్లను బానిసలుకంటే దారుణంగా పని చేయిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలుకు దశలవారి పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ , మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మాలకా రమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మెడిశెట్టి వెంకట రమణ, కాకినాడ రూరల్ కన్వీనర్ టి. రాజా తదితరులు మాట్లాడి మద్దతు తెలియజేసారు. ధర్నాలో కోశాధికారి రమణమ్మ, జ్యోతి, ధనలక్ష్మి, చామంతి, లక్ష్మీ, మేరీ సమాధానం, ఎస్తేరు రాణి, రాజేశ్వరి, భాంధవి, నాగమణి, తులసి, వీరమణి, వసుధ, జయ, నాగ సూర్యకళ తదితర అంగన్వాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వేళంగిలో ట్రస్టు ఆఫ్ బోండా సమావేశం



**కాకినాడ రూరల్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ట్రస్టు ఆఫ్ బోండా వారి 18వ అర్ధ సంవత్సరం సమావేశం వేళంగి గ్రామంలో ట్రస్టు అధ్యక్షులు బొ ండా వెంకన్నారావు అధ్యక్షతన శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోమ్ ఆవరణలో జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్ ఎస్ సి.చక్రరావు ఆల్ ఇండియా అనస్థీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు,ఆల్ ఇండియా పెయిన్ కిల్లర్స్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరుగా పని చేశారు.గుబ్బల రాంబాబు సేవా సమితి అధ్యక్షులు (స్వర్ణాంధ్ర వృద్ధుల ఆశ్రమం అధ్యక్షులు) రాజమండ్రి విచ్చేశారు. అతిథిగా వెలుగుబంట్ల వెంకటరమణ (మూర్తి) ఎన్.సి.సి అండర్ ఆఫీసర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షులు బొండా వెంకన్న రావు మాట్లాడుతూ ట్రస్టు ఇంతవరకు చేపట్టిన సేవా కార్యక్రమాలు,చేసిన ఆర్థిక వితరణలు తెలిపారు.ట్రస్టు నిర్వాహకులైన డైరెక్టర్స్ బోండా వీర వెంకట సత్యనారాయణ మూర్తి లక్ష్మీ కుమారి,డాక్టర్ బోండా సూర్యారావు అనిత రాణి, డాక్టర్ బోండా రాజ్ కుమార్ హరిణి,పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకినాడ దయా ఫౌండేషన్ వారి నిర్మాణానికి పదివేలు, అకాల మరణం పొందిన కురాడ గ్రామం వెంకట్రావు భార్యకు పదివేలు ఆర్థిక సహాయం అందజేశారు. సుమారు 500 మందికి లబ్దిదారులకు శీతాకాలం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు.బదిరెడ్డి వెంకన్న సౌజన్యంతో లబ్ధిదారులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.ముఖ్య అతిథులను ట్రస్టు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు,జమ్మిలు,ఇళ్ల ఆదేష్, సుంకరచంటి,సాధనాల శ్రీనివాసరావు,గంగా రామయ్య,వేలంగి లైన్స్ క్లబ్ సభ్యులు బొడ్డు భాస్కర్ రామన్,చంద్రు శ్రీధర్,చంద్రు వెంకన్న రావు,మెర్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గోశాల నిర్మాణానికి సహకరించండి



**పెడన,నవంబర్ 16 (వార్తాప్రభ) :** పట్టణంలో స్థానిక రెండవ వార్డులో హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్మాణం కాబోతున్న గోశాలకు ప్రతి ఒక్క హిందూ బంధువు సహకరించి భారీగా విరాళాలు ఇచ్చి గోశాల నిర్మాణానికి సహకరించవల సినదిగా హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు పట్టణంలో గల హిందూబంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హిందూ బంధువులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో గల62 దేవాలయాల సారధ్యములో శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ ఆగస్తయేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో కార్తీకమాసం పౌర్ణమి నాడు గోశాల స్థల సేకరణ నిర్మాణము నిర్వహణ కు విరాళాలు సేకరణ ప్రారంభయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ హిందూ బంధువులు అర్చకులు గూడూరు అగస్తీశ్వర శర్మ గోశాల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా కళాంజలి వార్షికోత్సవ వేడుకలు



**పెడన,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మ–ఠం వీధి లోని కళాంజలి హై స్కూల్ నందు యాన్యువల్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పెడన ఎస్సై 2 రాజేంద్రప్రసాద్ గవర్నమెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ సివిల్ ఇంజనీర్ సుబ్బారావు పాల్గొన్నారు. బాలల దినోత్సవం వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అలాగే 2024 మార్చి ఎస్ .ఎస్ .సి లో 592 మార్కులు సాధించి మండల ఫస్ట్ గా నిలిచిన జోయా ముస్కాన్ కు 588 మార్కులు సాధించిన ఆయేషా గుల్ ఫామ్ కు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటలు ఆడించడం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన యాజమాన్యాన్ని అభినందించారు .అలాగే వివిధ ఆటల పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు డాక్టర్ బి .వెంకటేష్ మాట్లాడుతూ కళాంజలి లో విద్యా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని కొనియాడారు. జిల్లా స్థాయి ,రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి సత్కరించారు .ఈ కార్యక్రమంలో చిన్నారులు ఫాన్సీ డ్రస్సులతో రాగా రైమ్స్ కు ప్రైమరీ విద్యార్థులు డాన్స్ చేశారు.హై స్కూల్ బాలురు చేసినా కరాటే విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.హై స్కూల్ విద్యార్థులు చేసిన అనేక నృత్య ప్రదర్శనలు అందర్నీ అలరించాయి .ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ కె.దిలీప్ కుమార్ ధన్యవాదములు తెలియజేశారు.

# వాసవి కళాశాలలో కార్తీకదీపోత్సవం



**పెడన,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దీపోత్సవం నిర్వహించారు. కళాశాలలో ఉన్న ఉసిరి చెట్టు కింద పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి ప్రవచనాలు వినిపించారు. విద్యార్థులు భక్తి గీతాలు సంబంధించి నృత్యాలు చేశారు. ఉత్తమ దీపాలంకరణ చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కుమార్ బాబు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబా ప్రిన్సిపాల్ బి ఆర్ ఎస్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ రాజా రమేష్ డిప్లమా ప్రిన్సిపాల్ ప్రసాద్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామ్మూర్తి నాయుడు సేవలు సదా స్మరణీయం

● సీఎం చంద్రబాబు సోదరుడు
మృతికి మంత్రి సుభాష్ సంతాపం

**రామచంద్రపురం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు,మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ఆయన మృతి తెలుగు దేశం పార్టీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటుగా పేర్కొన్నారు.నారా రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలు అందించారని మంత్రి సుభాష్ గుర్తు చేశారు. శాసనసభ్యుడిగా,మంచి మనసున్న మనిషిగా ప్రజలకు సేవ చేశారని, ఆయన విశిష్టమైన సేవలు,నిరాడంబరత మరవలేనివని మంత్రి సుభాష్ స్మరణకు తెచ్చుకున్నారు.నారా రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.రామ్మూర్తి నాయుడి సేవలను తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** కాను మోలు నందు పద్మశ్రీ గ్రహీత శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య ను స్మరించు కొని ఉపన్యాసం ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో రానా వెల్ఫేర్ సొసైటీఅధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ ముఖ్యఅతిథిగా పాల్గొని అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులైన పి ధనలక్ష్మి, గ్రామ పెద్దలు గ్రంధాలయాధికారి జే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు పరుగు పందెం మరియు మ్యూజికల్ చైర్స్ గేమ్స్ మరియు రైమ్స్ కార్యక్రమం నిర్వహించబడినది.

# రామ్మూర్తి నాయుడు మృతి పట్ల బుద్ధప్రసాద్ సంతాపం..

**అవనిగడ్డ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడైన రామ్మూర్తి నాయుడు చిన్న వయస్సులోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి పార్టీ నేతగా, ఎమ్మెల్యేగా తనదైన ముద్ర వేశారన్నారు. నిస్వార్థంగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగుదేశంలో కీలక నేతగా పార్టీని ప్రజలకు చేరువ చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు ఎల్లప్పుడూ "గుడ్ న్యూస్"!!

● రైతుల బాధను అర్థం చేసుకున్న మనసున్న సీఎం రేవంత్ ● సన్నలకు 500రూ బోనస్ ఇస్తున్న కాంగ్రెస్ సర్కార్ ● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ రామగుండం: నవంబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**కాంగ్రెస్ పాలనలో రైతులకు ఎల్లప్పుడూ "గుడ్ న్యూస్" అందుతుంది అని స్పష్టం చేశారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్



ఠాకూర్. ఈ మేరకు శనివారం స్థానిక నియోజకవర్గం పరిధిలోని జనగామ ప్రాంతంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... రైతుల బాధను అర్థం చేసుకున్న మనసున్న సీఎం రేవంత్ రెడ్డి అని, అందుకే రైతుల రుణమాఫీ చేసి వారి కళ్ళల్లో ఆనందం నింపారు అని అన్నారు. సన్నలకు 500రూ బోనస్ ఇస్తున్న కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తుంది అని తెలిపారు. తరుగు పేరిట రైతులను మోసం చేస్తే సంబంధీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇరెగ్యులర్ ఉద్యోగులకు కౌన్సిలింగ్!!

● 75 మస్టర్లు పూర్తి చేయని ఉద్యోగులు గైర్హాజరైతే చర్యలు ● ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్

**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి రామగుండం రీజియన్ వన్ పరిధిలోని జీడికే వన్, టూ, టూఏ, లెవెన్ ఇంక్లైన్, ఓసిపి ఫైవ్ గనులలో ఇరెగ్యులర్ ఉద్యోగులకు 18వ తేదీ సోమవారం రోజున ఉదయం 10 గంటలనుండి గోదావరిఖని ఆర్.సి.ఓ.ఏ. క్లబ్ నందు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పత్రిక ప్రకటనలో వివరాలను వెల్లడించారు జీఎం లలిత్ కుమార్. 75 మస్టర్లు పూర్తి చేయని ఉద్యోగులు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని అవసరమైతే విధుల నుండి తొలగించబడతారని తెలిపారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**తొర్రూర్ డిఎస్పి కృష్ణ కిషోర్**
**పట్టణలోపరీక్ష కేంద్రాల పరిశీలన**
**8 సెంటర్లలో 3364 మంది పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులు**



**తొర్రూరు:-నవంబర్ 16 (వార్తా ప్రభ)**ఈ నెల 17,18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల పకడ్బందీగా నిర్వహించే విధంగా ఏర్పాట్లను డిఎస్పీ కృష్ణ కిషోర్ ,సిఐ జగదీష్ పర్యవేక్షించారు.శనివారం తొర్రూరు సర్కిల్ లో ఉన్న 8 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.ఈ సంధర్భంగా డిఎస్పీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ%ొ% గ్రూప్-3 పరీక్షలు జాగ్రతగా నిర్వహించాలన్నారు. స్థానిక సర్కిల్ పరిధిలో 8 పరీక్ష కేంద్రాల్లో 3364 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు.అదేవిధంగా చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతి సెంటర్ ను విజిట్ చేసి పరీక్ష సెంటర్ లలో సీసీ కెమెరాలు, అవసరమైన పర్నిచర్, లైట్స్, టైయిలెట్స్, డ్రింకింగ్ వాటర్ ఏర్పాట్లతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.రేపు 17న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆ మరుసటి రోజైన 18వ తేదీన మధ్యాహ్నం సెషన్ లో పరీక్ష ఉంటుందని వివరించారు.బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రంలోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం.



**మందమర్రి నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** మందమర్రి మున్సిపాలిటీ 18వ వార్డులో రూ. 4.90 లక్షల అంచనాతో నూతన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను వార్డు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఎండీ, జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో డ్రైనేజీ సమస్య ఉందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. తెలపడంతో తక్షణమే స్పందించి వెంటనే నూతన డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చెయించారని బస్తి ప్రజలు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోగుల రాజయ్య సత్తయ్య ఇషాక్ చిట్టి సారయ్య గట్టయ్య తదితరులు పాల్గొన్నారు

# వార్తాప్రభ ఎఫెక్ట్!!

● నిర్లక్ష్యానికి షోకాజ్ నోటీసులు!! ● బాధ్యతారహిత్యానికి లిఖిత పూర్వక వివరణ
● అంగన్వాడీ టీచర్, సూపర్వైజరుకి నోటీసులు ఇచ్చిన కమిషనర్


వార్తాప్రభ

కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనపై బురద!!

● కుటుంబ సర్వే పథకంపై నిర్లక్ష్యం ● ఇంటింటికి వెళ్ళమంటే... ఎక్కడపడితే అక్కడ
● సెక్యూరిటీ వద్ద సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు

పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 15 (వార్తాప్రభ ప్రతినిధి)కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనపై బురద చల్లడం అంటే ఇదే. వివరాల్లోకి వెళితే..... ఇంటింటికి వెళ్లి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసే సమగ్ర కుటుంబ సర్వే పథకంపై ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇంటింటికి వెళ్ళమంటే... ఎక్కడపడితే అక్కడ దరఖాస్తు ఫారాలను వ్యక్తులకు ఇస్తున్నారంటే ఎంత క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రామగుండం పేరుతో ఉన్న ఒక పెద్ద కంపెనీ గేటు వద్ద సెక్యూరిటీ టేబులపై సమగ్ర కుటుంబ సర్వే పూరించబడి వివరాలు రాసి ఉన్న ఫారాలు ఎందుకు ఉన్నాయ్ అంటారు...?సంఘటనపై దర్యాప్తు జరిపి, కారకులు ఎవరో పసిగట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూద్దాం.

**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**నిర్లక్ష్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయమని ఆదేశించారు జిల్లా కలెక్టర్. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే పథకంపై నిర్లక్ష్యంతో వ్యవహరించిన అంగన్వాడీ టీచర్ (ఎన్యూమరేటర్, ఈవీ నెంబర్ 0232) వి.అనిత, అలాగే సూపర్వైజర్ (కమ్యూనిటీ ఆర్గనైజర్, మెప్మా రామగుండం ) డి.స్వరూప లకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ రామగుండం నగరపాలక సంస్థ పూర్తి అదనపు బాధ్యతల ఇంచార్జి జే.అరుణశ్రీ 24 గంటల లోపు లిఖితపూర్వక వివరణ అందజేయాలని షోకాజ్ నోటీసులను అందజేశారు. వార్తాప్రభ దినపత్రికలో వచ్చిన "కాంగ్రెస్ ప్రభుత్వ


రామగుండం నగరపాలక సంస్థ
పెద్దపల్లి జిల్లా

నెం. సి1/813/2024 తేది. 16.11.2024

షో-కాజ్ నోటీసు

విషయము: రామగుండం నగరపాలక సంస్థ – సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, పూరించబడిన సర్వే ఫారాలను ఎన్.టి.పి.సి. పి.టి.ఎస్. మెయిన్ గేటు వద్ద వదిలివేయడంపై లిఖితపూర్వక సంజాయిషీ సమర్పించుటకు – షోకాజ్ నోటీసు.

సందర్భము: 1. తేది. 15.11.2024 రోజున వార్తాప్రభ దినపత్రికలో ప్రచురితమైన వార్త
2. శ్రీయుత జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారి ఆదేశాలు.

తేది. 15.11.2024 రోజున వార్తాప్రభ దినపత్రికలో "కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనపై బురద!!" శీర్షికన రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్.టి.పి.సి. పి.టి.ఎస్. గేటువద్ద సెక్యూరిటీ టేబుల్ పై సమగ్ర కుటుంబ సర్వే పూరించబడి వివరాలు రాసి ఉన్న ఫారములు ఉన్న విషయమై వార్త ప్రచురించబడింది. ఇట్టి విషయమై వెంటనే తగు చర్యలు తీసుకోవలసినదిగా శ్రీయుత జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు ఆదేశాలు జారీ చేసినారు.

ఇట్టి ఆదేశాలననుసరించి విచారించగా, ఇట్టి సర్వే పూర్తి చేసి పూరించబడిన ఫారములు శ్రీమతి వి. అనిత, అంగన్‌వాడి టీచర్, ఎన్యూమరేషన్ బ్లాకు నెం. 0232 కు సంబంధించినవి అని గమనించడం జరిగింది. ఇట్టి సర్వే పూర్తి అయిన తరువాత వివరాలు పూరించబడిన సర్వే ఫారములు నిర్లక్ష్యంగా వదిలివేయడంపై ఎన్యూమరేటర్ శ్రీమతి వి. అనిత, అంగన్‌వాడి టీచర్ మరియు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత ఏరియా సూపర్ వైజర్ శ్రీమతి డి. స్వరూప, కమ్యూనిటి ఆర్గనైజర్, మెప్మా రామగుండం గారిపై ఎందుకు తగు క్రమశిక్షణ చర్యలు తీసుకొనరాదో ఈ షో-కాజ్ నోటీసు అందిన (24) గంటలలో మీ యొక్క లిఖితపూర్వక వివరణ సమర్పించుటకు ఆదేశించడమైనది.

16/11/24
కమిషనర్ (ఎఫ్.ఎ.సి.)

ఆలోచనపై బురద!! అనే శీర్షిక నేపథ్యంలో విచారణ చేపట్టి సంఘటనకు సంబంధించిన అంగన్వాడీ టీచర్, సూపర్వైజర్లపై తదుపరి క్రమశిక్షణ చర్యల నేపద్యంలో షోకాజ్ నోటీసులు అందజేసినట్లు తెలిపారు కమిషనర్ ( ఎఫ్.ఏ.సి.).

# మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

***"వలిగొండ -తొర్రూర్ ప్రధాన రహదారి పై పార్థివ దేహం పెట్టి ధర్నా నిర్వహించిన మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు"***

**అడ్డగూడూర్: నవంబర్ 15( వార్త ప్రభ )**యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన ఖమ్మం పాటి అంజయ్య గౌడ్ వయసు 57 సంవత్సరాలు గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా శాలిగౌరారం లో తన కూతురు ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో వలిగొండ-తొర్రూర్ ప్రధాన రహదారి చిర్రగూడూరు స్టేజి వద్ద రోడ్డు పనులు జరుగుతుండగా ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడి మరణించడం జరిగిందని తెలిపారు . పోస్టుమార్టం నిమిత్తం మృతున్ని పోలీసులు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం శుక్రవారం చిర్రగూడూర్ స్టేజి వద్ద మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు గ్రామస్తులు రోడ్డుపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ధర్నా



నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ కావడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ధర్నా చేస్తున్న మృతుని కుటుంబానికి సర్ది చెప్పి న్యాయం జరిగే విధంగా చూస్తామని ధర్నాను విరమింప చేయించారు

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



**శేరిలింగంపల్లి,నవంబర్ 16 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజక వర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్ మరియు ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం 16 నుండి రేపు 17వ తేదీ వరకు నిర్వహించనున్న 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి , 13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా



పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె శివ సేన రెడ్డి,గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో,కరాటే, కుంపు,లాంటి క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని,అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయని అన్నారు.ముఖ్యంగా ఆడ పిల్లల తలిదండ్రులు ఇలాంటి క్రీడలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు.పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ,ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైస్ ఛాన్స్ లర్ శ్రీనివాస్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన బద్దుల బాబురావు



**హైదరాబాద్,నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** జే.ఎన్.టీ.యు. ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ యాదవ్ పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా నియమితులైన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబు రావు యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అద్వితీయ ప్రతిభావంతుడైన శ్రీనివాస్ యాదవ్ పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా తెలంగాణ రాష్ట్రం గర్వించే విధంగా మరింతగా ఎదగాలని బాబురావు అభిలాష వ్యక్తం చేస్తూ ప్రో. శ్రీనివాస్ యాదవ్ ను సత్కరించారు ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి ఐలబోయిన రమేష్ యాదవ్ , తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ మరియు రాష్ట్ర యువజన కోశాధికారి బి మణి యాదవ్ తదితరులు ప్రొఫెసర్ శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించడం జరిగింది.

## ఒంటరిగా నివసిస్తున్న వృద్ధునికి.తోడుగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ



**మంద మర్రి నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** కొంతమంది స్థానికులు మా సొసైటీ దగ్గరికి వచ్చి ఇక్కడ ఒక నిరుపేద తిరుపతి రెడ్డి గత నెల నుంచి ఉంటున్నారని సమాచారం ఇచ్చారు.వెంటనే సొసైటీ సభ్యులు అంతా కలిసి.సఖి కేంద్రానికి సంప్రదించి అక్కడి నుంచి అనాధ నిలయానికి ఆ తిరులతి రెడ్డి ని ఆశ్రమానికి పంపించడం జరిగింది.అనంతరం వ్యవస్థాప అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మాట్లాడుతూ.మీ దృష్టిలో ఎవరైనా నిరుపేదలో గాని అభాగ్యులు గాని ఉన్నట్లయితే మా సొసైటీ కి సంప్రదించినట్లయితే వారికి తగిన న్యాయం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నంది పాట రాజ్ కుమార్, కార్యదర్శి గండ్ల సంజీవ్ పటేల్, జావిద్ పాషా,దిలీప్,చందు, తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ
# హైదరాబాద్

## 'ప్రాపర్టీ టాక్స్ డ్యూస్"పై ఆక్షన్!!

**మొండి బకాయి దారులపై చర్యలకు సిద్ధం**
**కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేర నోటీసులు**

**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని "ప్రాపర్టీ టాక్స్ డ్యూస్"పై ఆక్షన్ విధించడానికి, కఠిన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు సంబంధిత అధికారులు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేసి వేలం వేయడానికి రామగుండం మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులు సన్నద్ధమవుతున్నట్లు ప్రకటనలో వివరాలను వెల్లడించారు. **బకాయపడిన వారి జాబితా** : 1. శ్రీ నగర్ కాలనీ, ఇ.నెం. 6-1-1/1/2, లోటస్ ఎమ్.బి.ఎ. కాలేజ్ రూ.15,26,5612. మాతంగి కాలనీ, ఇ.నెం. 22-8-115, నారాయణ, సురేందర్ రెడ్డి, రాంరెడ్డి, గురువరెడ్డి, రూ.24,81,668 3.మాతంగి కాలనీ, ఇ.నెం. 22-8-117 వీరాంజనేయ ఇండస్ట్రీస్, రూ.18,99,4984. అల్లూరు, ఇ.నెం.11-2-62, ఫణి జూనియర్ కాలేజ్, రూ.9,26,0775.అల్లూరు, ఇ.నెం.11-3-1/A ముక్క నర్సింహమూర్తి, తండ్రి. రాజమల్లు, రూ.26,26,7296. 8 ఇంక్లైన్ కాలనీ, ఇ.నెం.11-7-518, ఐ. శివరెడ్డి, రూ.12,13,854 7. 8 ఇంక్లైన్ కాలనీ, ఇ.నెం. 11-7-621, కాసర్ల పాపయ్య, తండ్రి. రామస్వామి, రూ.2,71,730.00

## లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నియంత్రణతో పాటు రద్దీని తగ్గించవచ్చు

● శాసనసభ్యులు కెపి వివేకానంద్



**కుత్బుల్లాపూర్ నవంబర్ 16 (వార్తాప్రభ)** : హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్డిసిఎల్) లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా 29 కోట్ల రూపాయలతో చేపడుతున్న ఫాక్స్ సాగర్ - రాంరెడ్డి నగర్ ఇండస్ట్రియల్ ఏరియా లింక్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హెచ్ఆర్డీసీఎల్ అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు సమీప ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని, ఈ లింకు రోడ్ల పనులలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, స్థానిక నాయకులు ఇస్మాయిల్, హెచ్ఆర్డిసిఎల్ సీఈ శ్రీనివాస్, ఈఈ విజయ్ కుమార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ , విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డిసిఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపిన స్థానికులు



**పేట్ బషీరాబాద్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ -1, పద్మా నగర్ ఫేజ్ -2 సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వక్ఫ్ బోర్డు సమస్యతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించేలా సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సంధర్బంగా పద్మనగర్ ఫేజ్ -1, ఫేజ్ -2 వాసులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ లోని 55 కాలనీలలో, 171 సర్వే నెంబర్లలో గత కొన్ని రోజులుగా వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేశారు. ఈ కాలనీలలోని దాదాపు 90 శాతం మంది ప్రజలు అప్పులు చేసి, లోన్లు తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్లాట్లు కొని పెట్టుకుంటే వక్ఫ్ బోర్డు పేరుతో ప్రజలను వ్యధకు గురిచేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా ఇప్పటికే పలుమార్లు ఆర్డీవో, కలెక్టర్, డిఆర్, డిఐజి, ఐజీ వంటి ఉన్నతాధికారులను కలిసి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే ప్రజల పక్షాన పోరాడి సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ తనకు మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మా నగర్ ఫేజ్ -1 అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, పద్మా నగర్ ఫేజ్ -2 అధ్యక్షులు సత్తిరెడ్డి, సంక్షేమ సంఘాల సభ్యులు పప్పిరెడ్డి సురేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, సతీష్, అప్పారావు, మురళీ, బ్రహ్మానందం, దేవేందర్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రెండు బర్రెలు మృతి

**మంద మర్రి నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** మందమర్రి మండలంసారంగపెల్లి గ్రామపంచాయతీ పరిధి దుబ్బ పెల్లి గ్రామ లోని ఇందూరి శంకర్ చెందిన రెండు బర్రెలు విద్యుత్ షాక్ తో మృతి చెందాయి. మేత కోసం విడిచిపెట్టాడు గడ్డిమేస్తూ వెల్లి దుబ్బ పెల్లి గ్రామంలో అడవికి పోయే దారిలో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన కరెంటు తీగలు తగిలిరెండు బర్రెలు చనిపోయాయి. బర్రెలు ఇంటికి రాకపోయేసరికి వెతుకుతుండగా దుబ్బపెల్లి ప్రాంతంలో చనిపోయి కనిపించాయి.ఆర్థికంగా నష్టపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశాడు

# ఎడిటోరియల్

## ఆయన అంటే జగన్ కి అంత నమ్మకమా?

వైసీపీ చీఫ్ మాజీ సీఎం జగన్ నమ్మకం చూరగొన్నారు అంటే వారు గ్రేట్ అనే అనాలి. జగన్ అన్ని కోణాల నుంచి పరిశీలించిన మీదటనే వారి మీద పూర్తి నమ్మికను చూపిస్తారు. అలా జగన్ నమ్మకాన్ని వైసీపీలో కొండంత పొందిన వారుగా సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిని అంతా చూస్తున్నారువైసీపీ అయిదేళ్ల పాలనలో సజ్జల అంతా తానై కనిపించారు అని అంటారు. ఆయనను ప్రత్యర్థి పార్టీలు నాడు సకల శాఖల మంత్రి అని కూడా వ్యంగ్యంగా పిలుస్తూ ఉండేవి. సజ్జల పార్టీలోనూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముఖ్య పాత్రను పోషించారు. ఒక విధంగా వైసీపీ ప్రభుత్వంలో అత్యంత శక్తిమంతుడిగా సజ్జల కనిపించారు అటువంటి సజ్జలకు మరోసారి అధినాయకుడు జగన్ కీలకమైన స్థానాన్ని పార్టీలో ఇచ్చారు. వైసీపీ రాష్ట్ర స్థాయి కో అర్డినేటర్ పదవిని సజ్జలకు ఇచ్చారు. దీంతో ఈ అంశం ఇపుడు వైరల్ అవుతోంది. సజ్జకు ఇంతటి ప్రధాన హోదాని పార్టీలో ఇవ్వడం పట్ల కూడా వైసీపీలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయని అంటున్నారు.ఎందుకంటే సజ్జల వల్లనే పార్టీ ఓటమి పాలు అయిందని ఎన్నికల తరువాత జరిగిన విశ్లేషణలు చర్చలలో వచ్చినట్లుగా చెబుతారు. ఆయన జగన్ కి క్యాడర్ కి లీడర్ కి మధ్య గ్యాప్ ఉండేలా చేసారని కూడా విమర్శలు వచ్చాయి. అయితే సజ్జల పనితీరు జగన్ కి నచ్చడంతో పాటు ఆయన అత్యంత విశ్వాసపాత్రుడిగా నమ్మి మాత్రమే పట్టం కట్టారని మరో వాదన కూడా ఉంది. వైసీపీ ఉమ్మడి జిల్లాలలను రీజియన్లుగా విడదీసి రీజనల్ కో ఆర్డినేటర్లను నియమించింది. అలా మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, మిధున్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, విజయసాయిరెడ్డిలకు అవకాశం ఇచ్చారుఇపుడు మొత్తం స్టేట్ కో ఆర్డినేటర్ గా సజ్జలకు పెద్ద పదవినే ఇచ్చారు అని అంటున్నారు. అంటే రీజనల్ కో ఆర్డినేటర్లతో జిల్లా ఇంచార్జిలతో నియోజకవర్గం ఇంచార్జిలతో కూడా సజ్జల కో ఆర్డినేట్ చేసుకుంటూ ముందుకు సాగాల్సి ఉంటుందన్న మాట.ఒక విధంగా చెప్పాలీ జగన్ తరువాత అంతటి స్థాయి కలిగిన పదవిని సజ్జలకు ఇచ్చారని అంటున్నారు. వైసీపీలో చూస్తే స్టేట్ రీజనల్ కో ఆర్డినేటర్ పదవి గతంలో లేదు. కానీ ఇపుడు దానిని క్రియేట్ చేసి మరీ సజ్జలకు ఇచ్చారని అంటున్నారు. అందువల్ల సజ్జల మొత్తం పార్టీనే నడిపించే స్థాయిలో ఉన్నారని అంటున్నారు.పార్టీలో సజ్జల మీద భిన్న అభిప్రాయాలు ఉన్నా ఆయన విషయంలో జగన్ నమ్మకంతోనే ఇంతటి బాధ్యతలు అప్పగించారు అని అంటున్నారు భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని మరీ ఈ పదవిని ఆయనకు ఇచ్చారని అంటున్నారు. జమిలి ఎన్నికలు వస్తాయన్న ఊహాగానాల నేపథ్యంలో సజ్జలకు ఈ పదవికి ఇవ్వడం ద్వారా జగన్ పార్టీని యాక్టివ్ చేయాలని చూస్తున్నారు అని అంటున్నారు.ఇక చాలా కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఇంచార్జిలను నియమించారు. రానున్న రోజులలో మొత్తం 175 అసెంబ్లీ సీట్లకు ఇంచార్జిలను నియమించడం ద్వారా పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలని జగన్ ఆలోచనగా ఉందని చెబుతున్నారు.

## శభాష్ ...ఇది గొప్ప కార్యక్రమం.

● మునిసిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర



**విజయవాడ నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** పత్రికా సమావేశాలు చూసాము.... కానీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అన్ని పత్రికల ఎడిటర్స్ ఒకే చోట సమావేశం అయ్యి ఒక విధానాన్ని పాటించే విధంగా ముందుకు తీసుక వెళ్లే కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామని విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు.శనివారం ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని మర్యాదపూర్వం కంగా కలిసి ఈ నెల 24వతేది జరగబోవు రాష్ట్ర స్థాయి పత్రికా సంపాదకుల ఆత్మీయ సమావేశంకు ఆయన్ని ఆహ్వానించగా వారు పై విధంగా అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూర్మ ప్రసాద్ బాబు,ప్రధాన కార్యదర్శి రామమోహన్ రెడ్డి,సీనియర్ పాత్రి కేయులు శ్రీరామ్ యాదవ్,గణపతి రావు,ఎన్.ఎస్.ఆర్. శ్రీనివాస్ ,రాజా,మన్మధ రావు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకం నా నేస్తం

నా నేస్తము పుస్తకము
వెలిగించును మస్తకము
త్రుంచుతుంది అజ్ఞానము
పంచుతుంది విజ్ఞానము
ప్రయాణంలో తోడుగా
వస్తుంది మిత్రునిగా
సద్విషయాలు బోధించి
దిద్దుతుంది గురువుగా
ఒళ్ళంతా అక్షరాలు
వెలుగులీను కాగడాలు
పుస్తకము నా నేస్తము
అందించు స్నేహ హస్తము
అద్దంలా పుస్తకము
లోపాలను చూపించును
సృష్టికర్త బ్రహ్మ వోలె
తలరాతలు సరిదిద్దును
చదివితే పుస్తకాలు
బాగుపడును జీవితాలు
పలకరించును ప్రేమతో
పులకరించును హృదయాలు
పుస్తకాల పుట్టినిల్లు
భువిలో గ్రంథాలయాలు
ప్రతిదినమూ పఠిస్తే
మదిలో సంతోషాలు
పుస్తకం హస్త భూషణము
పరికింపగ అలనాడు
ప్రపంచాన్ని చరవాణి




ఏలుతుంది ఈనాడు
పుస్తక భాండాగారము
దర్శించాలోయ్! నిత్యము
మనశ్శాంతి నింపుతుంది
పెంచుతుంది వికాసము
పుస్తకం హస్త భూషణము
పరికింపగ అలనాడు
ప్రపంచాన్ని చరవాణి
ఏలుతుంది ఈనాడు
పుస్తక పారాయణము
శ్రేష్టమైన అలవాటు
నేర్పుతుంది క్రమశిక్షణ
ఇచ్చును బ్రతుకుకు రక్షణ

-గద్వాల సోమన్న,
9966414580

## మూడు నెలల్లో గ్రంథాలయ వ్యవస్థలో మార్పులు తెస్తా...

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు జీవనమంజూష పుస్తకావిష్కరణ సభలో వెల్లడి**





**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మూడు నెలల్లో గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చే దిశగా తన ప్రస్థానం మొదలుపెడతానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవమల్లెతీగ మాసపత్రిక-కామ్రేడ్ జిఆర్కె-పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంజు యనమదల రచించిన 'జీవన మంజూష' వ్యాససంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ-గ్రంథాలయ వ్యవస్థను మూడు నెలల్లో గాడిలో పెడతానని... ప్రభుత్వ పెద్దలు తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశ్రాంత ఐఎఎస్ ఆఫీసర్, కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్, రచయిత ఎఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ - సమాజాన్ని చదివిన రచయితల రచనలు ఎప్పటికీ సజీవంగా వుంటాయన్నారు. మంజు యనమదల రాసిన ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ ఆ కోవకు చెందినవేనన్నారు. అతిధులుగా హాజరైన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ యం. ప్రభాకర్ మాట్లాడుతూ మనిషిలో ఉన్నటువంటి మంచితనం వెలికి తీయాలంటే ఇలాంటి మంచి పుస్తకాలు ఇంకా రావాలన్నారు. మరో అతిధి గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సీతమ్మవారు 14 ఏళ్ళ వనవాసం చేస్తే మంజూష గారు 14 పుస్తకాలతో 'కవన్న' వాసం చేసిన రచయిత అన్నారు. సుప్రసిద్ధ నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం పుస్తకాన్ని సమీక్షిస్తూ - మంజు రాసిన చిన్న చిన్న వ్యాసాలు చలం మ్యూజింగ్స్ ను గుర్తుకు తెస్తున్నాయన్నారు. పుస్తక రచయిత్రి మంజు మాట్లాడుతూ తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కు నూతన ఛైర్మన్ గా ఎంపికైన గోనుగుంట్ల కోటేశ్వరరావును నిర్వాహకులు, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, కార్యదర్శి రవికుమార్, గ్రంథాలయ సిబ్బంది సత్కరించారు. మల్లెతీగ కలిమిశ్రీ అతిధుల్ని వేదిక మీదకు ఆహ్వానించగా కుర్రా సురేష్ బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ఆరోగ్యకరమైన డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలు నివారణ

● ఇబ్రహీంపట్నం సి.ఐ -ఎ చంద్రశేఖర్



**ఇబ్రహీంపట్నం నవంబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి ):-** ఇబ్రహీంపట్నం శ్రీ వీరాంజనేయ ట్రక్ వర్కర్స్ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు కే - 325 నూతన స్టాండ్ కార్యవర్గం ఎన్నిక - సిఐటియు చేరిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసుకోని - శ్రీ వీరాంజనేయ మినీ ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన స్టాండ్ ప్రారంభం రిబ్బన్ కట్ చేసి ఇబ్రహీంపట్నం సిఐ ఎ చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలు నివారణ అవుతాయని, మీ కుటుంబం సమాజం బావుంటుందని , మద్యం సేవించి రోడ్డు మీద డ్రైవింగ్ కి దూరంగా ఉండాలని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రతి డ్రైవర్ ఆరోగ్యం గా ఉండాలంటే హెల్త్ చెకప్ రెగ్యులర్గా చేయించుకోవాలని గుండె , కళ్ళు ఆరోగ్య సమస్యలపై డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎన్ సి హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్స్ కీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు నివారణ చర్యలో భాగంగా ప్రతి వ్యక్తి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. యూనియన్ ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ వీరాంజనేయ మినీ ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు కె యస్ ప్రసాద్, వల్లభనేని శ్రీనివాస్, సురేష్, మోరంపూడి సుధాకర్, వి సీతారామాంజనేయులు, ఓ పుల్లారావు, మక్కల వెంకటేశ్వరరావు, యం భద్రి , ఓ వెంకటేశ్వరరావు, చల్లా లక్ష్మణ , హెచ్ నరేష్, ఎన్ నరసింహ రావు పి కృష్ణ,టి వీరాజు , ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు

● ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి ● ఈ నెల 19 ధర్నా చౌక్ లో జరిగే "నిరసనను" జయప్రదం చేయండి ● వామపక్ష పార్టీల నాయకులు పిలుపు




**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల పై విద్యుత్ భారం మోపవద్దని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం హనుమాన్ పేట దాసరిభవన్ లో వామపక్ష పార్టీల పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి జి .కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఇటీవల వేసిన 6,072 కోట్ల ట్రూ అప్ భారం ఇంకా అమలులోకి రాకముందే అంతకు రెట్టింపు భారాన్ని అదనంగా ప్రజలపై మోపటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేము అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని, ప్రజలను మోసగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీల బాదుడును అపాలన్నారు. మొత్తం రూ.17 వేల కోట్ల భారం ప్రజల పై మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు.ఈ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ 2022-23 వాడుకున్న విద్యుత్ ను ఆనాటికి ఇంధనపు చార్జీలు నేడు వేసి ప్రజలకు కూటమి ప్రభుత్వం కరెంట్ షాక్ ఇస్తుందన్నారు. ప్రభుత్వ కరెంట్ ప్లాంట్ జెన్కో నుండి విద్యుత్ ఇస్తే తక్కువ ధరకు, నాణ్యమైన కరెంట్ అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధిక ధరలకు మార్కెట్ లో కరెంట్ కొనుగోలు చేస్తుందన్నారు. దాని వలన ప్రజల పై భారం పడుతుందని తెలిపారు. ఈ భారల పై ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, బాధ్యత కూడా వహించాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని చెప్పారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో పాటు అన్ని రకాల పన్నులు పెరిగియన్నారు. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలి, వచ్చేటటువంటి భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు పోలారి, ఎస్. యు. సి. ఐ .నాయకుల సుధీర్ , ఎం సి పి ఐ (యు) నాయకులు సలీం ,మాట్లాడారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, సిపిఎం నాయకులు బోయ సత్తిబాబు, తుపాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపులో కోలాహలంగా సంఘ్ ఎన్నికల ప్రచారం

● కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించిన ఎన్ఎఫ్ఐఆర్ మరియు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య



**ఇబ్రహీంపట్నం నవంబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):-** రైల్వేలలో నూతన పెన్షన్ విధానాన్ని (ఎన్ పీఎస్) రద్దు చేయించి పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానాన్ని (యూపీఎస్) అమలు చేయించేందుకు కృషి చేస్తామని ఎన్ఎఫ్ఐఆర్ మరియు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య హామీ ఇచ్చారు. డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను పురస్కరించుకుని గుంటుపల్లి రైల్వే వాగన్ వర్క్ షాపులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్క్ షాపులోని కార్మికులను కలుసుకుని రైలు ఇంజన్ గుర్తుకు ఓట్లు వేసి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ 8వ పే కమిషన్ ను త్వరగా ఏర్పాటు చేసేందుకు, డాక్టర్ ఆక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ.32,500 సాధించే విధంగా సంఘ్ కృషి చేస్తుందన్నారు. 2020 జనవరి నుంచి 2021 జూన్ వరకు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ/ డీఆర్ ను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైల్వేలో 12 గంటల డ్యూటీని రద్దుచేసి ఎనిమిది గంటలకు డ్యూటీలు ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, నాయకులు ర్యాలీ ముందు పూలు చల్లుతూ రాఘవయ్య ను ప్రత్యేక వాహనంపై తోడ్కొని వెళ్లారు. అడుగడుగునా పూలమాలలు, గజమాల, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా కార్మికులు హారతులు ఇచ్చి నుదుట తిలకం దిద్దారు. రాఘవయ్య ప్రచారానికి కార్మికుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదాం సంతోష్ కుమార్, వర్క్ షాప్ డివిజన్ ప్రెసిడెంట్ బాబు నాయక్, వర్క్ షాప్ డివిజన్ సెక్రటరీ అరుణ్ కుమార్, సంఘ్ వర్కింగ్ కమిటీ మెంబర్ నరేష్, సంఘ్ వర్క్ షాప్ బ్రాంచి కార్యదర్శి, డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ గద్దా సురేష్, చైర్మన్ పామర్తి శివ నాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, ట్రెజరర్ పి.విమల్ సాయి, ఆఫీస్ బేరర్లు జి.సుధాకర్, లాలియా నాయక్, ఎస్.బోయాజ్, ఆర్.ఎన్.మద్దయ్య, కె.శంకరరావు ఎం.డి.రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం



**కనిగిరి నవంబర్ 16 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో శనివారం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మొదటి అన్నదాన కార్యక్రమాన్ని పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య ధర్మపత్ని విజయ లక్ష్మి దంపతుల సహకారంతో ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరము కార్తీక మాసం నవంబర్ 16 నుండి జనవరి 16 వరకు ఉచిత శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్లు గుత్తి వెంకట రాజా, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య లు నిర్వహిస్తున్నారు. ఈ శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విరాళాల సేకరణలో సహాయ సహకారాలు అందించిన కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఎంతైనా అభినందనీయులని దేవస్థాన చైర్మన్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావిటి వెంకటసుబ్బయ్య, గుత్తి వెంకటరాజా,సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, ఓగూరి నరసింహారావు, వాయినేని వైట్ మాల్యాద్రి, రాచూరి సురేష్, కంబాల రోశయ్య స్వామి, అయ్యప్ప స్వాములు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఎస్. హెచ్ .ఓ. లో ,మెదడు,నరముల ఉచిత వైద్య శిబిరం "

**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచ మధుమేహం నిరోధక మాసం సందర్భంగా .....ప్రతి ఆదివారం ఒక స్పెషలిస్టుతో ఉచిత వైద్య శిబిరాలు, శాస్త్రి యఅవగాహన సభలలో భాగంగా.... ఎస్ . హెచ్. ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 17వ తేదీఆదివారం మెదడు,నరముల జబ్బుల పై శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యస్థాపకులు డాక్టర్ టి. సేవకుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరు రమేష్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు గుంటూరులోని 2/1 బ్రాడీపేట లో గల ఎస్. హెచ్. ఓ. బిల్డింగులో నిర్వహించే ఈ వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభలో మెదడు, నరముల వైద్య నిపుణులు డాక్టర్ పి.నటరాజ పాల్గొంటారన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొనవల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు .

## ఇబ్రహీంపట్నంలో ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



**ఇబ్రహీంపట్నం నవంబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):-** జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ లో శనివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు పి.గిరికుమార్ (ఈనాడు), ఎం.నాగేశ్వరరావు (వార్త) కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రారంభమైన రోజునే జాతీయ పత్రికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జర్నలిస్టులు రాసే వార్తల విషయంలో వ్యక్తిగతంగా దృష్టి కేంద్రీకరించకుండా, చట్టబద్ధమైన చర్యలతో వాస్తవ, అవాస్తవాలను గ్రహించే విధంగా పరోక్షంగా రక్షణగా ఏర్పాటైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాచరణలను వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఏపీఎంపీఏ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ హాఫీజ్ ఖాద్రీ, సీనియర్ పాత్రికేయుడు డేవిడ్, జర్నలిస్టులు శ్రీనివాస్, మురళి, రాఘవులు, క్రాంతి, రవీంద్ర, శివ, సత్య, నరేష్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

## నారా రామ్మూర్తి నాయుడు సేవలు చిరస్మరణీయం

***రామ్మూర్తి మృతికి ఎంపి కేశినేని శివనాథ్ సంతాపం***



**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్ర దిగ్భ్రాంత్రి వ్యక్తం చేశారు. 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి ఎమ్మెల్యే గా రామ్మూర్తి నాయుడు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివి. పార్టీకి అందించిన సేవలు వెలకట్టలేనివి, చిరస్మరణీయం. ఆయన మరణం నారా కుటుంబానికి తీరని లోటు అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నారా రామ్మూర్తి నాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఎంపి కేశినేని శివనాథ్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేయటంతోపాటు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే సోదర వియోగంతో చింతిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడుకి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రాఘవేంద్రులకు రథోత్సవ సేవలు

**మంత్రాలయం:నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి మఠం లో శనివారం రాత్రి రథోత్సవ సేవలు నిర్వహించారు. రథోత్సవ సేవలు చేయించినటువంటి భక్తుల పేరు గోత్ర నామాల మీద సంకల్ప పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తి ప్రహల్లాద దేవుడిని చెక్క బంగారు వెండి నవరత్న రథోత్సవాలపై ఉంచి పండితుల వేద మంత్రోచ్చానలతో మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహామూర్త, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా ఎన్టీఆర్ జిల్లా శిష్టకరణం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24 న కార్తీక వనభోజనాలు

**శిష్ట కరణం సాంఘియులు ఈ కార్యక్రమం జయప్రదం చేయండి**

**శిష్ట కరణం రాష్ట్ర ఉపాధ్యక్షు,కృష్ణా జిల్లా శిష్ట కరణం సంఘ ప్రధాన కార్యదర్శి బలివాడ శివకుమార్ పట్నాయక్ పిలుపు**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 (వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల24 ఆదివారం తోట వాటర్ వర్క్స్ పంపు హౌస్ పక్కన పాములు కాలవ దగ్గర జగ్గంపూడి, విజయవాడ చిరునామా లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం5 గంటలు వరకూ శిష్ట కరణం సాంఘియుల కార్తీక వన సమారాధన (భోజనాలు) జరుగుతాయని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శిష్ట కారణం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7-30గం నుండి సత్యన్నారాయణస్వామి వ్రతం,దంపతులు పాల్గొనవచ్చునితదుపరి బ్రేక్ ఫాస్టు, టీ ఏర్పాటుచేశామని, పిక్నిక్ లో ఆత్మీయశిష్టకరణ బంధువులు, కుటుంబాలతోచక్కనిసమావేశం..జరుగుతుంది.రాష్ట్రనాయకులు, జాతీయనాయకులు శిష్టకరణఅభివృద్ధి గురించి ప్రసంగిస్తారని పట్నాయక్ వివరించారు. మెగా లక్కీ డిప్ ఉంటుంది.ఈ లక్కీ డిప్ లో సుమారు 50 కి పైగా బహుమతులు గెలుచుకునే అవకాశముందని ఉచితంగా అందరు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగలవారందరూ పాల్గొనే మెగా హౌసీ నిర్వహించబడుతుంది.బహుమతులుంటాయని పిల్లలకు జామెట్రీ బాక్సులు ,కలర్ పెన్సిల్స్ , పెన్నులు లాంటి బహుమతులుంటాయని పిల్లలకు,యువతీయువకులకు ఆటలు పాటలపోటీలు ంటాయిమహిళలకు మ్యూజికల్ చైర్స్ లాంటి ఆటలపోటీలుంటాయి.పాటలు పాడేవారు డాన్స్ చేసేవారు పాల్గొనవచ్చును కావలసిన వారికి విశాఖపట్నంలో రిలీజ్ చేసినవివాహపరిచయవేదిక వివరాలతో ఉన్న పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగానే ప్రత్యేకంగా శిష్టకరణ ప్రముఖనాయకుల రౌండ్ టేబుల్ సమావేశం కూడాఏర్పాటుచేయడం జరుగుతుంది.ఓబిసి సాధనకు, బిసి-డి నుండి బిసి-ఏలో చేర్చడానికి ప్రయత్నాలు,తీర్మానాలు చేయడం ఉండే అవకాశముందన్నారు. కృష్ణాజిల్లాలో రిటైర్ అయినటువంటి కొంతమంది శిష్టకరణం ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ..అలాగే ఇటీవల వరదలలో శిష్టకరణబాధితులకు సహాయాన్ని అందించిన వారిని సత్కరించడం జరుగుతుందని శిష్టకరణంలేఖ డిజిటల్ మాసపత్రిక గురించి ,దానిని అందరూ ఉచితంగా ఎలా చదువుకోవచ్చును లాంటి విషయాలపై విపులంగా తెలపడానికి లేఖ టీమ్ వారుకూడా హాజరవుతున్నారు. కేస్టు సర్టిఫికేటు కు అవసరమైన సంఘం సర్టిఫికేటును కావలసినవారికి ఇచ్చుటకు ఏర్పాటుచేస్తున్నామని ఉమ్మడి కృష్ణాజిల్లాలో నివసిస్తున్న ప్రతిఒక్క శిష్టకరణసభ్యుడూ తప్పక హాజరవాలి.అందరిని కలుసుకోవాలి.మన బలం ప్రదర్శించుకునే అవకాశం వదలకండని ఆయన పిలుపునిచ్చారు.ఇంకను వివరాలకు సంప్రదించండి. ఉపాధ్యక్షులుఆంధ్రప్రదేశ్ రాష్ట్రశిష్టకరణం సంఘం ఉపాధ్యక్షులు, కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శి, బలివాడ శివకుమార్ పట్నాయక్ కోరారు.

## నగరంలో రానున్న స్మార్ట్ రోడ్లు

**డ్రోన్ల ద్వారా 17 కిలోమీటర్ల రోడ్ సర్వే**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నగరంలో స్మార్ట్ రోడ్ల కొరకు శనివారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు సర్కిల్లోనూ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్ లో స్మార్ట్ రోడ్లను 11 ప్రాంతాలలో నిర్మించేందుకు 17 కిలోమీటర్ల రోడ్ సర్వేను డ్రోన్ ద్వారా నిర్వహించారు. ఈ రోడ్ సర్వేలో రోడ్డుపై ఉన్న గుంతలు, డివైడర్, పేవర్ బ్లాగ్స్, ఫుటపాత్ లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్ లు పరిగణంలో ఉంచుకొని రోడ్ సర్వేను చేస్తున్నట్లు తెలిపారు . స్మార్ట్ రోడ్ల ద్వారా కేవలం నాణ్యమైన రోడ్లనే కాకుండా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్ ద్వారా ఆదాయం పెంచే వనరులను కల్పించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారని తెలిపారు. స్మార్ట్ రోడ్లను నిర్మించడమే కాకుండా ఒక సంవత్సరం పాటు వారి నిర్వహణ బాధ్యత కూడా ఏజెన్సీ వారిదేనని తెలిపారు. స్మార్ట్ రోడ్లను సర్కిల్ వన్ పరిధిలో బి ఆర్ పి రోడ్, కేటీ రోడ్, నెహ్రూ రోడ్, కుమ్మరిపాలెం సెంటర్, సితార సెంటర్లో 7.3 కిలోమీటర్లు, సర్కిల్ 2 పరిధిలో బి ఆర్ టి ఎస్ రోడ్, సాంబమూర్తి రోడ్, జి ఎస్ రాజు రోడ్, కంర్రిక జంక్షన్ లో 6.2 కిలోమీటర్లు, సర్కిల్ 3 పరిధిలో హెచ్ టీ లైన్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు లో 4.14 కిలోమీటర్లు, మొత్తంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 17 కిలోమీటర్లు స్మార్ట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

## నగరంలో కళ్యాణ మండపాలు,ఫంక్షన్ హాల్స్ వల్ల ట్రాఫిక్ సమస్యలు

**● ట్రాఫిక్ రద్దీ నియంత్రణ దిశగా నగర పోలీసులు అడుగులు ● ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మండపాలు, హోటల్స్ యజమానులతో సమన్వయ సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజ శేఖర బాబు**






**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరములో మరియు పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మంటపాలు, బొంకేట్ హాల్స్ లో జరుగుచున్న వివాహములు/బర్త్ డే/ఇతర కార్యక్రమాలు సందర్భములలో సదరు ఫంక్షన్ హాల్స్ పరిసర ప్రాంతములు మరియు వాటికి వెళ్ళు మార్గములలో ట్రాఫ్ఫిక్ అంతరాయములు గుర్తించిన మీదట, వాటిని పరిష్కారము చేయు ఉద్దేశ్యముతో ఎస్. వి. రాజ శేఖర్ బాబు, ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమీషనర్ వారి ఆదేశముల మేరకు శనివారం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ప్రముఖ ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మండపాలు, బొంకేట్ హాల్స్ మరియు ప్రముఖ హెూటల్స్ యాజమాన్యముతో శనివారం సమన్వయ సమావేశము ట్రాఫ్ఫిక్ అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశములో ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మంటపాలు, బొంకేట్ హాల్స్ కార్యక్రమాల సమాచారము ముందుగా తెలియకపోవుటవలన ట్రాఫిక్ అంతరాయములు ఏర్పడటం , దానివలన సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురికావడం జరుగుతుందని వారికి వివరించి, దానిని వారి సహకారంతో అధిగమించడానికి అస్త్రం యాప్ లో ఒక ఆన్ లైన్ సమాచార దరఖాస్తు పొందుపరచడం జరిగిందని. అస్త్రం యాప్ లో ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మంటపాలు, బొంకేట్ హాల్స్ వారి వివరాలతో వాట్స్ యాప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపి, ఆన్ లైన్ దరఖాస్తు లో కార్యక్రమము ప్రారంభ టైం, ముగించు టైం ఎంతమంది పాల్గొంటారు,ఎన్ని కార్లు/బస్సులు/ద్విచక్ర వాహనములు వచ్చే అవకాశము వుంది, ప్రముఖ వ్యక్తులు ఎవరు పాల్గొంటున్నారు,వివరాలు వాట్స్ యాప్ గ్రూప్ లో ముందుగా ఇచ్చి ట్రాఫ్ఫిక్ పోలీసు కి సహకారము అందించేయాలని పోలీసు అధికారులు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయములు నివారించడం లో వారి వంతు బాధ్యతగా సహకారము అందించాలని విజ్ఞప్తి చేశారు., ప్రస్తుత సమాజంలో ప్రజలు సాంకేతికతంగా నగదు లావాదేవీలు జరుపుతున్న తరుణంలో, అనేక విధములుగా సైబర్ మోసాలకు గురిఅయ్యి కష్టపడి సంపాదించిన నగదు పోగొట్టుకోవడం జరుగుతున్నదని , దానిని నివారించుటకు ప్రజల అవగాహన కొరకు పోలీసు కమీషనర్ రూపొందించిన కొన్ని పాటించివలసిన సలహాలు కుడా వివరించారు.సలహాల ప్రతులు ఫంక్షన్ హాల్స్, కళ్యాణ మంటపాలు, బొంకేట్ హాల్స్ వారికి ఇచ్చి వారి యొక్క ఆవరణలో కుడా సదరు సలహాలు వుంచి సైబర్ మోసాల నుండి కాపాడుకొనుటకు ప్రజలకు అవగాహన కల్పించే విధముగా సహకరించ వలసినదిగా కోరారు. ఈ కార్యక్రమములో పోలీస్ కమిషనర్ తో పాటు, లా అండ్ ఆర్డర్ డి.సి.పి. గౌతమి షాలీ, , డి.సి.పి. ట్రాఫిక్ కృష్ణమూర్తి నాయుడు, ట్రాఫిక్ అడిషనల్ డి.సి.పి., ఏ.వి.యల్.ప్రసన్న కుమార్, ట్రాఫిక్ ఏ.సి.పిలు, సి.ఐలు, యస్ .ఐ.లు మరియు ఫంక్షన్ హాల్ కళ్యాణ మండపాల, హెూటల్స్ ల యజమానులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరు నిస్వార్ధంగా పనిచేయాలి

**పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పిలుపు**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు సర్కిల్ వన్ లోని సి డి ఒ లు, సోషల్ వర్కర్లు, సి ఒ లు , ఆర్ పి లు, డ్వాక్రా సంఘాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ శనివారం భవానిపురం లోని ఎన్డీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించి నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా ప్రతి విభాగం నిస్వార్ధంగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతం చేయడానికి డ్వాక్రా సంఘాలకు, కమ్యూనిటీ సంస్థలు వారి సమాఖ్యలకు శిక్షణను ఇస్తామన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు శిక్షణ తోడ్పాటు నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

## తిరువూరు సమైక్య ప్రెస్ క్లబ్ జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు.



**తిరువూరు, నవంబర్ 16,(వార్త ప్రభ)** :::జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తిరువూరు నియోజకవర్గ సమైక్య ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ బాషా ఆధ్వర్యంలో తిరువూరు పట్టణం లోని శ్రీ భగవాన్ మహర్షి ఆశ్రమం, అమ్మ ఆశ్రమం,దివ్యాంగుల సేవా ఆశ్రమాల్లో దివ్యాంగులు, వృద్ధులు, అనాధలకు పండ్లు పంపిణీ చేయటం జరిగగింది.ఈ కార్యక్రమంలో సమైక్య ప్రెస్ క్లబ్ లీగల్ అడ్వైజర్ మర్సకట్ల కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.నరేష్ , ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రదీప్ పాల్గొన్నారు .

## ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ మరియు డేటా సైన్స్ పై గెస్ట్ లెక్చర్



**మైలవరం:నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ మరియు డేటా సైన్స్ విభాగములో క్రాఫ్టింగ్ టుమారోస్ సొల్యూషన్స్ టుడే అనే సాంకేతిక అంశంపై గెస్ట్ లెక్చర్ ను శనివారం ప్రారంభించారు.ఈ గెస్ట్ లెక్చర్ కు వక్తలు గా సాండ్ స్పెస్ టెక్నాలజీస్ కంపెనీ నుంచి ఎ.రవి తేజ,మొహమ్మద్ ఆషర్ రెహాన్ లు విచ్చేశారు.ఈ సందర్భంగా రవి తేజ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు డేటా సైన్స్ అనేది ఒకే అత్యుతమమైన సమహారం అని తెలియజేశారు.బి.టెక్ మొదటి సంవత్సరంలోనే దీని గురించిన విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు.రవి తేజ మాడ్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజె న్స్ మరియు డేటా సైన్స్ యొక్క అనేక ప్రయోజనాలు డేటా సైన్స్ తో ముడిపడి వున్నాయి అని తెలియజేశారు. విద్యార్థులు డేటా సైన్స్ అంటే ఏమిటి అనే విషయాన్ని విలియం.ఎస్. క్లివ్ లాండ్ అనే వ్యక్తి కనుగొన్నాడనీ,డేటా ని ఏవిధంగా వాడాలి ఎక్కడ వాడాలి ఎలా వాడాలి అనే విషయాలు మనకు డేటా ని వృద్ధి చేసే టూల్స్ మీద ఆధారపడి ఉంతుందని పేర్కొన్నారు.ప్రొఫెసర్ మరియు హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ డా. ఒ.రామ దేవి మాట్లాడుతూ ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే సాఫ్ట్వేర్ రంగములో వాడే టూల్స్ గురించిన అవగాహన కలిగిఉండటం ఎంతో అవసరమని తెలియజేశారు.విద్యార్థులకు కావలసిన అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానము పెపొందించుకొనుటకు కావలసిన అన్ని సాఫ్ట్వేర్ మరియు హార్డ్వేర్ పరికరాలను అందించడములో కళాశాల యాజమాన్యంమరియు ప్రిన్సిపాల్ డా. కె.అప్పారావు ఎప్పుడూ ముందుంటార ని తెలియజేశారు.ఈ గెస్ట్ లెక్చర్ ను సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెస్సర్స్ ఎస్.శివ రామకృష్ణ,కె.వినయశ్రీ బాయ్, కె. సుధాకర్ లు మొదట సంవత్సరం అధ్యాపకులు పర్యవేక్షించారు.ఈ గెస్ట్ లెక్చర్ కు మొదటి సంవత్సరం విద్యార్థు లు అందరూ పాల్గొన్నారు.

## పాత్రికేయుల వెతలు తీరాలి

**సీనియర్ జర్నలిస్ట్ గణపతిరావు పొలమర శెట్టి ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం**



**విజయవాడ, నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)**దశాబ్దాల కాలంగా నానా అగచాట్లు పడుతున్న పాత్రికేయుల జీవితాల్లో మార్పులు రావడం లేదని, వారి వెతలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు సీనియర్ జర్నలిస్టులు వీర్ల శ్రీరామ్ యాదవ్, గణపతిరావు పొలమ ర శెట్టి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సంపాదకుల సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీరామ్ యాదవ్, గణపతిరావు ను పాత్రికేయులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా రంగం ముఖ్యంగా చిన్న పత్రికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను సోదాహరణంగా వివరించారు. ఈ దుస్థితిని నిలువరించాలంటే ప్రభుత్వాలు సత్వరం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి పత్రికా సంపాదకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూర్మా ప్రసాదవాబు, ప్రధాన కార్యదర్శి ఏ రామ్ మోహన్ రెడ్డి, ఏపి ఎంపీ ఏ నాయకులు నాగోతి శ్రీనివాసరావు, మన్మధ రావు, రాజా, కోటేశ్వరరావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పేద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్త బోడేపుడి కి మోడీ చిత్రపటం బహుకరణ



**ఇబ్రహీంపట్నం నవంబర్ 16(వార్తా ప్రభ ప్రతినిధి):-** మండల పరిధిలోని కాచవరం గ్రామ శివాలయం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బోడెపుడి అప్పారావుకు బిజెపి మండల అధ్యక్షులు పయ్యావుల రాము మోడీ చిత్రపటాన్ని బహుకరించారు. సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ శివాలయం నిర్మించి హిందూ ధర్మాన్ని కాపాడుతూ కార్తీక పౌర్ణమి మహెూత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన ను ఘనంగా సన్మానించారు.అనంతరం దేశ ప్రధాని మోడీ చిత్రపటాన్ని బహుకరించారు. ఆధునిక యుగంలో సాంప్రదాయాలను విస్మరిస్తున్న సమయంలో కూడా హిందూ సనాతన ధర్మానికి కట్టుబడి ఆలయం ద్వారా హిందూ ధర్మానికి చేస్తున్న సేవలకు ఆయనను అభినందనలు తెలియజేస్తూ సన్మానించినట్లు ఈ సందర్భంగా రాము తెలిపారు. ప్రజలకు విస్తృత సేవలందిస్తున్న ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ ను సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు పయ్యావుల జయలక్ష్మి, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ కి కేబీఎన్ విద్యార్థి సిహెచ్ రత్నరాజ్ ఎంపిక



**విజయవాడ పశ్చిమ, నవంబర్ 16:- (వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి రోలర్స్కేటింగ్ లో కేబిఎన్ కళాశాల విద్యార్థి సిహెచ్ రత్నరాజ్ 500 మీటర్ల స్కేటింగ్ పోటీలో గోల్డ్ మెడల్, మూడువేల మీటర్లు స్కేటింగ్ పోటీలో మరొక గోల్డ్ మెడల్ సాధించినట్లు ఎస్ కే పి వి వి హిందూ హై స్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి నారాయణ రావు తెలియజేశారు. అదేవిధంగా ఈనెల 26 నుంచి బెల్గాం కర్ణాటక లో జరగబోయే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ కి ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపిక కావడం ఎంతో గర్వకారణం అని తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో విద్యార్థి రత్న రాజ్ ను అభినందించారు. విద్యార్థినితో పాటు అతన్ని ప్రోత్సహించిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి హేమచంద్రరావుని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ పి ఎల్ రమేష్, డాక్టర్ ఎంకటేశ్వరరావు, డాక్టర్ కే రామకృష్ణ, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

**తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిసిన**

## ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య



**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :వార్తా ప్రభ ప్రతినిధి**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు ను మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి త్వరగా ఇన్చార్జి నియమించాలని రామయ్య కోరారు.సభ్యత నమోదు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో చేస్తున్నామని రామయ్య తెలిపారు.నియోజకవర్గంలో ప్రతి బూత్ లో 40% సభ్యత నమోదు చేయాలని ఆదేశించిన రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాస్ కి రామయ్య సమాధానం చెబుతూ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిపి సభ్యత్వ నమోదు వేగవంతంగా పనిచేస్తున్నారని వివరించారు.

## చురుగ్గా సాగుతున్న ఎస్వి పల్లి అంతర్గత రోడ్ల నిర్మాణం



**పెడన నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** పెడన మండలం ఎస్ వీ పల్లి గ్రామపంచాయతీలో అంతర్గత రోడ్ల నిర్మాణం సాగుతుంది.శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ సూచన మేరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి 22 లక్షల 50 వేల రూపాయలను ఈ పంచాయతీకి అధికారులు కేటాయించారు. పంచాయతీ పరిధిలోమూల మరిగుంట గ్రామానికి వెళ్లే రహదారి తోపాటు హరిజనవాడలో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పనులు సాగుతుండగా పంచాయతీరాజ్ ఏఈ ధర్మయ్య పర్యవేక్షిస్తున్నారు.





శివానంద నగర్ లో రాఘవేందర్ ముదిరాజ్ స్వామి నేతృత్వంలో జరిగిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమం లో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు సీ.కృష్ణ యాదవ్ మరియు రాంనగర్ కార్పొరేటర్ రవి చారి, బిజెపి నాయకులు గంగిశెట్టి రాజేష్ మరియు తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్న చిత్రం **-వార్త ప్రభ, హైదరాబాద్**

## నంద్యాల పట్టణంలో రాష్ట్ర స్థాయి పడవ పోటీలు ప్రారంభం




**నంద్యాల నవంబర్16 (వార్తాప్రభ):**నంద్యాల పట్టణంలో రాష్ట్రస్థాయి కెనోయింగ్ , కయాకింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, న్యాయవాది పబ్బతి అపర్ణ తెలిపారు. ఆదివారం డ్రాగన్ బోట్ రేస్ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమలోనే తొలిసారిగా నంద్యాలలో జరుగుతున్న ఈ పోటీలకు మంచి స్పందన లభించిందని, విజేతలు నేషనల్ లెవెల్ పోటీలకు అర్హత సాధిస్తారని శనివారం పేర్కొన్నారు.

# ప్రజా సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం!!

**● రామగుండంలో పారిశుద్ధ్య విభాగానికి పెద్దపీట ● నిర్లక్ష్యం వహిస్తే సీరియస్ యాక్షన్ ● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 16 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజా సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఈ మేరకు శనివారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగానికి కోటి నాలుగు లక్షల రూపాయలతో నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రామగుండంలో పారిశుద్ధ్య విభాగానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగాలి అని తెలిపారు. ప్రతి ఉద్యోగి, పారిశ్శుద్ధ విభాగం కార్మికులు స్వచ్ఛత, పరిశుభ్రత కోసం కృషి చేయాలి అని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారిపైన కూడా సీరియస్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) మేయర్, కార్పోరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాందేవ్ ఆసుపత్రిలో సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ డే 4వ వార్షికోత్సవ వేడుకలు...

**కూకట్ పల్లి ,నవంబర్16 (వార్తాప్రభ):**సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ డే 4వ వార్షికోత్సవాన్ని శనివారం రాందేవ్ రావు హాస్పిటల్ కూకట్ పల్లి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఛాయాదేవి (అబ్స్టెట్రిక్అండ్ గైనకాలజీ హెచ్ ఓ డి), డాక్టర్ భవాని దివ్య( పీడియాట్రిక్స్ హెచ్ ఓ డి ) డాక్టర్ మంజుల (కన్సల్టెంట్ గైనకాలజిస్ట్) అర్చనా మోరే, డాక్టర్ ఎన్. యోబు సీఈవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వారం వద్ద వచ్చే క్యాన్సర్ని క్యాన్సర్ సర్విక్స్ అంటారనీ 80% కంటే ఎక్కువ హెచ్ పి వి ఇన్ఫెక్షన్ వలన కలుగుతాయని, ఆడవారిలో వచ్చే క్యాన్సర్లో 17% కంటే ఎక్కువగా ఈ గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ అనేది వస్తుందని, ప్రతి 50 మంది మహిళలలో ఒకరికి ఇది వారి జీవితకాలంలో సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మన భారతదేశంలో ప్రతి 8 నిమిషములకు ఒక స్త్రీ ఈ వ్యాధికి బలి అవుతుందని తెలిపారు. దాదాపు 200 మందికి పైగా ప్రతిరోజు ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సర్వైకల్ క్యాన్సర్స్ లో మూడులో ఒక వంతు మన భారతదేశంలో నమోదవుతున్నాయని తెలిపారు. ఈ వ్యాధిని నిర్మూలించడానికి డబ్ల్యూ హెచ్ ఓ- ఎఫ్ ఓ జి ఎఫ్ ఐ (గైనకాలజిస్ట్ అసోసియేషన్) వారు సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ ప్రోగ్రాంను 17 /11/ 2020లో ప్రారంభించడం జరిగిందన్నారు. దీనిని 90 -70 -90 ప్రోగ్రాం అంటారనీ 90% మంది 9 నుంచి 14 సంవత్సరముల లోపు బాలికలకు ఈ వ్యాక్సినేషన్



ఇప్పించడం, 70 శాతం మంది మహిళలు క్యాన్సర్ సర్వీస్ స్క్రీనింగ్ పాప్ స్మీర్ హెచ్ పి వి చేయించుకోవడం ,మరియు 90% మంది స్క్రీనింగ్ ద్వారా బయటపడ్డ మహిళలకు సులువుగా ట్రీట్మెంట్ ఇవ్వడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రాందేవ్ రావ్ హాస్పటల్ నందు తొమ్మిది నుంచి 14 సంవత్సరముల లోపు వయసు కలిగిన బాలికలకు వాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.గత సంవత్సర కాలం నుండి ఇప్పటివరకు 1500 పైగా ఫ్రీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగింది ఇది కాకుండా 30 నుంచి 65 సంవత్సరముల మహిళలకు స్క్రీనింగ్ చేయడం జరుగుతుందనీ ఇప్పటివరకు 200 మంది పైగా మహిళలకు స్క్రీనింగ్ ప్రారంభించడం జరిగిందని, అవసరమైన వారికి కాల్పోస్కోపీ ద్వారా బయాప్సీ తీయడం జరుగుతుందనీ తెలియజేశారు. దీనితోపాటు థర్మో అబ్లేషన్ లాంటి ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందనీ తెలిపారు.డాక్టర్ భవాని దివ్య మాట్లాడుతూ 0.5 ఎంఎల్ వాక్సిన్ తీసుకోవడం వలన జీవితమంతా సర్వైకల్ క్యాన్సర్ నివారించవచ్చునని వివరించారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ కాల్ పోస్కోపి టెస్టింగ్ గురించి మరియు మామోగ్రామ్ గురించి వివరించారు. అర్చన మోరే మాట్లాడుతూ 9 నుంచి 14 సంవత్సరముల లోపు ఆడపిల్లలు అందరూ కూడా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వాళ్ల కుటుంబాలకు కూడా అవగాహన కల్పించాలని వివరించారు. డాక్టర్ యోబు మాట్లాడుతూ ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్ వాక్సిన్ తీసుకొని క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలని, రాందేవ్ రావ్ హాస్పటల్ పెద్ద ఎత్తున సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని వివరించారు. డిసెంబర్ 10వ తేదీన 250 మంది పిల్లలకు ఫ్రీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రివెన్షన్ ,ఎర్లీ డిటెక్షన్ ,ఎర్లీ ట్రీట్మెంట్ ద్వారా సమాజం నుంచి సర్వైకల్ క్యాన్సర్ని పూర్తిగా నిర్మూలించడం మా యొక్క ముఖ్య ఉద్దేశం అని ఈ సందర్భంగా డాక్టర్ యోబు తెలిపారు.

## జవహర్ నగర్ లో 100 ఫీట్లు రోడ్డు విస్తరణలో భూములు నష్టపోయిన బాధితులను పరామర్శించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,



**జవహర్ నగర్, నవంబర్, 16:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ లో శనివారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పర్యటించారు. చెన్నాపురం చౌరస్తా నుండి బీజేఆర్ నగర్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణలో భూములు నష్టపోయిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబాలాజీ నగర్, జవహర్ నగర్ లో 60 ఏళ్ల క్రితం ఇక్కడ భూములు మాజీ సైనికులకు ఇస్తే వారు ప్రభుత్వ అనుమతులతో లేఅవుట్లు చేస్తే రెక్కల కష్టం మీద బతికే పేదవాళ్లు కొనుక్కున్నారు. జవహర్ నగరంతా ప్రభుత్వ పరమైన భూమి అని అక్రమంగా గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకున్నారని అనడం తప్పు. ఇవి ఆనాడు ఎక్స్ సర్వీస్ మెన్ కి ఇచ్చిన భూములు తప్ప ప్రభుత్వ పరమైన భూములు కావు.ఈ మధ్యకాలంలో కొంతమంది పేదలు ఈ ప్రభుత్వంతో ఎందుకు పెట్టుకోవాలి, ఎప్పుడు వచ్చి ఇళ్లను కూల్చివేస్తారో, ఎక్కడ ఇబ్బంది పెడతారో... ఎన్నో ఏళ్ల క్రితం కొనుక్కున్న భూమిని మళ్లీ అమ్ముకోవడానికి ఇబ్బంది అవుతుందని ఎల్ ఆర్ ఎస్ కింద డబ్బులు కట్టిన వారు కూడా ఉన్నారు. జీవో నెంబర్ 58, 59 లో అనేకమంది డబ్బులు కట్టి రెగ్యులరైజ్ చేసుకున్నారు. ఇవాళ వాళ్లకు సపోర్ట్ చేయాల్సిన ప్రభుత్వం మేము కూల్చి వేస్తాం దిక్కున్న చోట చెప్పకో అని అహంకారపూరితంగా మాట్లాడుతున్న అధికారులు.. ప్రజల శ్రమ మీద బతుకుతున్నారని మర్చిపోతున్నారు.ఇప్పటికే హైడ్రా, మూసినది ప్రక్షాళన పేరిట పేదల ఇల్లు కులగొట్టారు. రేవంత్ రెడ్డి పేదల ఇల్లు కూలగొట్టే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నాడు. సర్కారు చేసిన పిచ్చి పనులు చాలు. మీరు అనుకున్న అందమైన నగరానికి, అందమైన రోడ్లకు మేము వ్యతిరేకం కాదు కానీ పేదల బతుకులు నాశనం చేసి రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తా అంటే చూస్తూ ఊరుకోము ఊరుకోమని ఈటెల రాజేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లపు రవి, నాగారం చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితమే భక్తికి పరమార్థం కావాలి.

**- అమ్మ వారి సౌందర్యమే శాశ్వతం**

**- ప్రముఖ ప్రవచనకులు డాక్టర్ గరికపాటి నరసింహారావు**




**విజయవాడ పశ్చిమ నవంబర్ 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజ హితమే భక్తికి పరమార్థం కావాలని, అప్పుడే కనకదుర్గాదేవి అనుగ్రహం లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రి ఎస్ కే పి వి హిందూ హైస్కూల్ కమిటీ సంయుక్త నిర్వహణలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రవచన కార్యక్రమం శనివారం కేబీఎన్ కళాశాలలో ప్రారంభమైంది. గరికపాటి మాట్లాడుతూ అమ్మవారి సౌందర్యం మాత్రమే శాశ్వతమైందని, మిగిలినదంతా ఎప్పటికైనా రూపుమాసిపోతుందన్నారు. దుర్గా అనే పదాన్ని పలకటం వల్లనే కష్టాలు రూపుమాసిపోతాయన్నారు. ప్రపంచంలోనే ప్రతి అణువులను అమ్మశక్తి దాగి ఉంటుందన్నారు. శక్తి చైతన్యాన్ని గుర్తించే ఆత్మ చైతన్యాన్ని సాధించడమే అమ్మవారి ఉపాసన రహస్యంగా గుర్తించాలన్నారు. మహాభారత యుద్ధానికి మూలంగా నిలిచిన అర్జునుడికి శక్తినిచ్చిన తల్లి కనకదుర్గాదేవి అని, దుర్గా శక్తివల్లనే పరమేశ్వరుడు కూడా తన కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతున్నాడని అన్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు రచించిన కనకదుర్గానంద లహరి లోని శ్లోకాలను రాగ భావ యుక్తంగా గరికపాటి గానం చేసిన తీరు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.ఎస్.రామారావు, హిందూ హై స్కూల్ కమిటీ అధ్యక్షుడు టి శేషయ్య, కెబీఎన్ కళాశాల కార్యదర్శి టి శ్రీనివాసు గరికపాటిని ఘనంగా సత్కరించారు.



# మకర మండల దీక్ష లను ప్రారంభించిన అరుణ్ గురుస్వామి

**ఆలయ ప్రాంగణంలో శనివారం నుండి డిసెంబర్ 31 వరకు జరిగే "అన్న ప్రసాద భిక్ష" కార్యక్రమాన్ని ప్రారంభించిన వడ్డేపల్లి గురుస్వామి...**

**కూకట్ పల్లి,నవంబర్16(వార్తాప్రభ):**హరిహర సుతుడు, శబరిమల వాసుడు, శ్రీశ్రీశ్రీ అయ్యన్ అయ్యప్ప దేవా స్వామి వారి పవిత్ర మకర మండల దీక్ష నెల ఈ సంవత్సరం 2024 శనివారం నవంబర్ 16 అనగా శనివారం నుండి ప్రారంభమైన సందర్భంగా కూకట్ పల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో మండల దీక్ష పూజలు అరుణ్ గురు స్వామిచే ఘనంగా ప్రారంభించారు. అయ్యప్ప పరమ భక్తుడు కూకట్ పల్లి అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, అరుణ్ గురు స్వామిచే అయ్యప్ప మాల ధారణ చేసుకుని భక్తిశ్రద్ధలతో నియమాల తోరణాన్ని స్వీకరించారు. అనంతరం ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మకర మండల దీక్ష ప్రారంభమైన సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులందరినీ కోరుకునేది ఏమిటంటే అందరూ కూడ ఈ దీక్షను మనకు కలిగినంతలో స్వామి వారి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని నియమాలతో 41 రోజులు దీక్షను పాటించి శ్రీ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలకు పాత్రులు కావాల్సిందిగా కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు.అలాగే నేటినుంచి అయ్యప్ప స్వాములు అందరికి సౌలభ్యం కోసం కూకట్ పల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నప్రసాద (బిక్ష) కార్యక్రమం ప్రారంభమై వచ్చే నెల డిసెంబర్ 31'వ తేదీ వరకు కొనసాగుతుందని తెలియజేశారు. అలాగే అయ్యప్ప స్వామి ఆలయానికి విచ్చేసినటువంటి స్వాములకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.





## రెడ్డిగూడెం ఎస్సీ ఏరియాలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం,



**రెడ్డిగూడెం నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)**:రెడ్డిగూడెం ఎస్సీవాడ లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దబాబు) ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు ఆదేశాల మేరకు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గౌరవనీయులైన విజయబాబు ఆశీస్సులతో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజన్ ఉన్న నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి సభ్యులుగా చేరేందుకు యువతరం ముందుకు రావడం జరుగుతుందని వారందరికీ ఆహ్వానం పలుకుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వసంత యువసేన నాయకులు మాతంగి రామారావు, చాట్ల అచ్చియ్య, బాబూరావు,కృష్ణ, చింతిరాల రమేష్, ఏసు,అనంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి,నవంబర్ 16 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.కథక్ నాట్య గురువర్యులు సంజుక్త ఘోష్ శిష్య బృందం మొదటగా బెంగాలీ సంస్కృతి సంప్రదాయ రవీంద్రనాథ్ టాగోర్ పాటలకి రవీంద్ర నృత్య ప్రదర్శన మరియు కథక్ నృత్యం లో గురు వందన,శివ స్తోత్రం,శివ తాండవం, జయంతి దేవి చాముండే అంశాలను ఆరాత్రిక,శ్రియ, యశస్వి,రిథమ్,నిషిక, వందన,శుభశ్రీ,శతాబ్ది, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.కూచిపూడి నాట్య గురువులు ఒగ్గు ప్రవీణ్ శిష్య బృందం తాండవనృత్యకారి, జతిస్వరం,రామాయణ శబ్దం,మరకత,మండూక శబ్దం,దశావతార శబ్దం, హిందువుల తిల్లాన మొదలైన అంశాలను అతిథి,తారా, కేయ,వేహ,రిష్వ,శ్రీద,కృతి, పూర్వి,ఈషా,దీక్ష మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆలయ చైర్మన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్**





**జవహర్ నగర్, నవంబర్,16:(వార్తా ప్రభ** అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అని అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలతో జవహర్ నగర్ లోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన తెలిపారు ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా నవంబర్ 16 నుండి డిసెంబర్ 31 వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు ముదిరాజ్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ పూర్ నవీన్ కుమార్, అయ్యప్ప స్వాములు రంగ శ్రీమన్నారాయణ, బిక్షపతి, చెన్నారెడ్డి, నరేష్, నర్సింగ్ రావు, కృష్ణ, అయ్యప్ప స్వాములు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టాన్ని గుర్తించి సత్కరించడం అభినందనీయం



**గన్నవరం, నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)** దేశానికి వెన్నుముక వంటి రైతులను గౌరవించడం మనందరి భాధ్యతగా గుర్తించాలని గన్నవరం గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య తెలిపారు. స్థానిక గౌడపేట రామాలయంలో శనివారం శ్రీపరంజ్యోతి అమ్మ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో కృతజ్ఞత దినోత్సవంలో భాగంగా రైతులకు పారా, తట్ట, తువాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఎండ, వాన లెక్కచేయకుండా రైతులు ఆరుగాలం శ్రమించి దేశానికి అవసరమైన ఆహార ఉత్పత్తులను పండిస్తున్నారని చెప్పారు. వీరి కష్టాన్ని గుర్తించి సముచితంగా సత్కరించడం అభినందనీయమన్నారు. సేవా సమితి సభ్యులు పి. పద్మావతి మాట్లాడుతూ...కృతజ్ఞత దినోత్సవంలో భాగంగా దేశానికి సేవలందిస్తున్న వర్గాలను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రైతులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ, సంఘంలోని ప్రజల్లో కృతజ్ఞత భావాన్ని పెంపొందించడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిద్దిద్దవచ్చని తెలిపారు. పుర ప్రముఖులు నిడమర్తి నాగేశ్వరరావు, సంఘ సభ్యులు జి. దుర్గ, పి. శివపార్వతి, అరుణ కుమారి, శ్రీనివాసరావు, కోటమ్మ, నాగలక్ష్మి, వీరాస్వామి, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

## రామ్మూర్తి నాయుడు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఇరిగెల

**ఆళ్లగడ్డ: నవంబర్ 16 : (వార్తాప్రభ ప్రతినిధి)**ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతిపై శనివారం ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ ఇరిగెల రాంపుల్లారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# చేనేత వృత్తి పరిరక్షణ కోసం 2 వేల కోట్లు కేటాయించాలి






**పెడన,నవంబర్ 16 (వార్తాప్రభ) :** చేనేతలను విస్మరిస్తూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత పరిశ్రమకు జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు పెడన పురపాలక సంఘం మాజీ చైర్మన్ భండారు ఆనంద ప్రసాద్ అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేనేతలకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం వైయస్సార్ నేతన్న నేస్తం పేరుతో ప్రతి సంవత్సరం 24 వేల రూపాయల చొప్పున సుమారు 80 వేల మంది చేనేత కళాకారులకు నేరుగా బ్యాంక్ అకౌంట్కు ట్రాన్సర్ చేసిందనీ అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు లక్షల మంది చేనేత కార్మికులు ఉన్నారనీ కానీ వైసీపీ ప్రభుత్వం కేవలం 80 వేల మందికి మాత్రమే నేతన్న నేస్తం ఇస్తున్నారని మొత్తం మూడు లక్షల మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ఇవ్వాలని అనేక సందర్భాలలో డిమాండ్ చేశారని ఆయన అన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం కనీసం ఒక్క చేనేత కళాకారునికి కూడా నేతన్న నేస్తం ఇవ్వడంలేదని అన్నారు. చేనేత పరిశ్రమకు ఆయువుపట్టు అయినటువంటి చేనేత సహకార సంఘాలను వైసిపి నాయకత్వం పూర్తిగా విస్మరించిందనీ, వైసిపి ప్రభుత్వంలో చేనేత పరిశ్రమ నాశనం అవుతుందని అనేక సందర్భాలలో అనేక వేదికలపై అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారని కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో కేటాయింపులను పరిశీలిస్తే చేనేత సహకార సంఘాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో ఆ పార్టీ నాయకులకు సిగ్గుచేటని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేనేత సహకార సంఘ వ్యవస్థను పరిరక్షిస్తామని చేనేత పరిశ్రమకు పునర్జీవం పోస్తామని అనేక వేదికలపై ఇచ్చిన హామీలూ, ఎన్నికల సందర్భంలో చేసిన వాగ్దానాలూ ఏమయ్యాయో కూటమి అధి నాయకులతోపాటు కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన చేనేత నాయకులు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. చీరాలలో జరిగిన ఎన్నికల సభలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులందరికీ ప్రతి సంవత్సరం 24 వేల రూపాయలు అందిస్తామని స్వయంగా ప్రకటించారనీ కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక చెప్పిన మాటలను పూర్తిగా విస్మరించడం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేతలను మోసం చేయడమే అని ఆయన అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం చేనేత సామాజిక వర్గాల వారందరికీ నాలుగు కుల కార్పొరేషన్లు ఏర్పాటుచేయగా ఇప్పుడు ఏర్పడిన కూటమి ప్రభుత్వం కేవలం ఒక చేనేత సామాజికవర్గం వారికే కార్పొరేషన్ ఏర్పాటుచేసి మిగిలిన చేనేత సామాజికవర్గాల వారిని విస్మరించడం చాలా దారుణం అని, ఇప్పటివరకు పరస్పర అవగాహనతో అన్నదమ్ముల్లా ఉన్న చేనేత కులాల మధ్య అంతరాలు పెంచే విధంగా ఈ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత నాయకులకు అధికారాలతో కూడిన గౌరవప్రదమైన పదవులు దక్కితే సంతోషిస్తామనీ కానీ ఒక ప్రాంతంలో కొంతమందికి పదవులు ఇచ్చినంత మాత్రాన చేనేత పరిశ్రమ మొత్తానికి న్యాయం చేసినట్లు కాదని చేనేత పరిశ్రమ అభివృద్ధికి వృత్తి పరిరక్షణకు రాష్ట్ర బడ్జెట్లో అధిక కేటాయింపులు జరిపించి చేనేత పరిశ్రమను చేనేత సహకార సంఘాలను చేనేత కార్మికులను ఆదుకుంటేనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేతలకు న్యాయం జరిగినట్లుగా భావిస్తామని ఆయన అన్నారు. గత రెండు నెలల క్రితం చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత తో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు చర్చలు జరపగా ఆమె పరిశ్రమను పునరుద్ధరించేందుకు ఇచ్చిన హామీలు అమలుచేస్తామని చెప్పారనీ కానీ చేనేత శాఖ మంత్రి స్వయంగా చెప్పిన మాటలకు కూడా విలువలేకుండా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయంటే బీసీ మంత్రులకు పదవులు అప్పగించారు తప్ప, అధికారాలు అందనివ్వలేవని, ఆధిపత్య కులాల వారైన పార్టీ అగ్రనాయకుల చేతిలోనే అధికారాలు ఉంచుకుని పరిపాలన చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా చేనేత వృత్తి పరిరక్షణకు రెండు వేల కోట్లు కేటాయించి రాష్ట్రంలో ఉన్న చేనేత కళాకారులందరికీ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలనీ, అన్ని చేనేత సామాజిక వర్గాలవారికి రాష్ట్ర ప్రభుత్వ కుల కార్పొరేషన్లు పునరుద్ధరించాలని, చేనేత కార్మికులకు ఆరోగ్య భీమా కార్డులను జారీచేయాలనీ, చేనేత వ్యవస్థను పరిరక్షించే విధంగా సహకార సంఘాలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఇనమాల శివరాం ప్రసాద్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు బీజేపీ రాష్ట్ర చేనేత నాయకులు వాసా పల్లపు రాజు ఏ ఐ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనాథం పరమేశ్వరరావు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్ల వెంకటరమణ గుంటూరు నగర పద్మసాలి సంఘం అధ్యక్షులు గుర్రం చిన్న వీరయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు బత్తూరి మోహనరావు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి అల్లక తాతారావు, భావసార క్షత్రియ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు వినాయకరావు సీపీఐ నాయకులు గజవల్లి వెంకట కృష్ణారావు దొడ్డి ఈశ్వరరావు భావసార క్షత్రియ సంఘం ప్రధానకార్యదర్శి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నారా రామ్మూర్తి నాయుడు కి నివాళులర్పించిన తెదేపా నాయకులు



**మైలవరం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు శనివారం అకాల మరణం చెందారు.మైలవరం పట్టణం లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆ ఆ పార్టీ నాయకు లు, కార్యకర్తలు శనివారం నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**విస్సన్నపేట,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో సైబర్ నేరాలు నిరోధించేందుకు అన్ని బ్యాంకులలో ఎస్ ఐ జి రామకృష్ణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బ్యాంకు సంబంధిత లావాదేవీల విషయమై ఫోన్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అడగడం జరుగుతుందని అందరూ అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులకు అవగాహన కల్పించారు.

# మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ కు రతన్ టాటా మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ గా నామకరణం చేయాలి

- మల్లవల్లి పారిశ్రామిక వాడ రానున్న రోజుల్లో రాష్ట్రానికే తలమానికంగా మారుతుంది
- మల్లవల్లి పారిశ్రామిక వాడ ఫేస్ -2 కు తగిన భూమిని కేటాయించండి
- గన్నవరం నియోజక వర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్




**గన్నవరం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం బడ్జెట్ లో పరిశ్రమలకు 4370 కోట్లకు పైగా నిధులు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు కు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు . శనివారం ఆయన అసెంబ్లీ సమావేశాలలో మల్లవల్లి పారిశ్రామిక క్యారిడర్ అభివృద్ధి పై ప్రసంగించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడ లో పారిశ్రామిక వేత్తలకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో 16.5 లక్షల కు ఎకరం కేటాయిస్తే గత వైసీపీ ప్రభుత్వం 89.5 లక్షలకు పెంచిందని మండిపడ్డారు .గత వైసిపి ప్రభుత్వ తీరు కారణంగా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం నుండి పారిపోయిన పరిస్థితి నెలకొందని వాపోయారు . ప్రముఖ దిగ్గజ కంపెని అశోక్ లే లాండ్ కంపెని ప్రారంభానికి సిద్ధంగా గత ప్రభుత్వ తీరు వల్ల వెన్నకి వెళ్లారని విమర్శలు చేశారు .మల్లవల్లి పారిశ్రామిక వాడ సెకండ్ ఫెస్ కోసం జిల్లా అధికారులతో సంప్రదించి తగిన భూమి ని గుర్తించాలని కోరారు . రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు మల్లవల్లి కి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు .తాను గన్నవరం నియోజకవర్గంలో 15 వేల ఉద్యోగాలు కల్పించకపోతే తాను వచ్చే ఎన్నికలో ఓటు అడిగానని చెప్పానని చెప్పారు. మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ కు రతన్ టాటా మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ గా నామకరణం చేయాలనీ కోరారు . .రాష్ట్రాన్ని అన్ని విధాలా వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని ధ్వజమెత్తారు . అక్రమ కేసులు పెట్టడం మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధి పై పెట్టలేదని అన్నారు . డబ్బులు దండుకోవడమే పనిగా అప్పటి నాయకులు పనిచేశారని విమర్శలు చేశారు . భౌగోళికంగా అభివృధి చెందే మల్లవల్లి పారిశ్రామికవాడ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని.. తగిన భూమి ని కేటాయించాలని ఆయన ముఖ్యమంత్రి , సంబందిత మంత్రి ని కోరారు

# డ్రింకర్ సాయి ప్రబోదాత్మక చిత్రం : కాకాని బాబు






**హనుమాన్ జంక్షన్, నవంబర్ 16 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లో శుక్రవారం సాయంత్రం కె యస్ టాకీస్ లో డ్రింకర్ సాయి టీజర్ అభిమానుల హర్షధ్వానాల మధ్య అట్టహాసంగా విడుదల చేశారు. కాకాని బాబు అరుణ దంపతుల కుమారుడు కాకాని ధర్మ రెండవ చిత్రం డ్రింకర్ సాయి. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మొత్తం హీరో ధర్మ స్వగ్రామమైన హనుమాన్ జంక్షన్ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. ధర్మ ,ఐశ్వర్య శర్మ జంటగా నటించిన చిత్రం డ్రింకర్ సాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ ను హైదరాబాద్ లో ప్రముఖ దర్శకులు మారుతీ ఇటీవల విడుదల చేశారు. ఎవరెస్ట్ సినిమాస్ స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై బసవరాజు శ్రీనివాస్ , ఇస్మాయిల్ షేక్ , బసవరాజు లహరీదర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రాన్ని కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో రూపొందించి శేహబాష్ అనిపించారు. ముందుగా ధర్మ ఇంటి నుంచి చిత్ర బృందం మోటార్ సైకిళ్ళు , కార్ల రాలీ తో హనుమాన్ జంక్షన్ లోని ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కె యస్ టాకీస్ లో టీజర్ విడుదల చేశారు. కాకాని బాబు, కాకాని అరుణ,హీరోయిన్, హీరో, డైరెక్టర్, ప్రొడ్యూసర్ తో సహా ఇతర నటీనటులు సాంకేతిక నిపుణు లు పాల్గొన్నారు.అందరూ తమ తమ అమూల్యమైన సందేశాలను అందించారు. హీరో ధర్మ తండ్రి కాకాని బాబు మాట్లాడుతూ తాను చిన్నతనంలోనే సినిమాలు తీశానని డిస్ట్రిబ్యూషన్ కూడా చేశానని నా అనుభవాలు నా కుమారుడికి ఉపయోగ పడలేదని అన్నారు. తాను ఈ సినిమా చూశానని చాలా బాగుందని అన్నారు. ఈ సినిమా విజయవంత మవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు.

# పి ఆర్ టి యు వినతిపత్రం



**విస్సన్నపేట,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో విద్యా శాఖలో 9 నెలలుగా ఉపాధ్యాయ రిజిస్టర్లు అప్డేట్ కాలేదని ఇంక్రిమెంట్లు సరెండర్ లీవ్ లు ఉపాధ్యాయ పాఠశాలలలో ఇబ్బందులు ఎంఈఓ 1 సంబంధిత సమావేశాలు నెలకు ఒక్కసారైనా కల్పించాలని ఎంపీడీవో చిన్న రాట్నాలు కు వినతి పత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోకల శ్రీరామ మూర్తి, సెక్రటరీ కే నరసింహారావు, పెమ్మరాజు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీరవల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు




**హనుమాన్ జంక్షన్,నవంబర్ 16 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి శాఖ గ్రంథాలయం వారు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులతో గ్రంథాలయ విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించి గ్రంథాలయ పితామహులు ఎస్ ఆర్ రంగనాథన్ శ్రీ అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి గ్రంథాలయాలకు వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం నిర్మల, గ్రంథాలయ అధికారి పీ స్వర్ణలత, అభివృద్ధి కమిటీ సభ్యులు కోడేబోయినబాబి, అధ్యాపకులు జగతి మేడం, అరుణకుమారి, క్రాంతి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఉద్యమంలో నిస్వార్థ సేవలందించిన పాతూరి నాగభూషణం చిరస్మనీయులు



**విజయవాడ, నవంబర్ 16 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమాలలో భాగంగా ఈరోజు ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేసిన మహానుభావులు గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య గారు గ్రంథాలయ ఉద్యమానికి వెన్నెముక అయినటువంటి పాతూరు నాగభూషణం మరియు గ్రంథాలయ శాస్త్ర పితా మహులు ఎస్ ఆర్ రంగనాథన్ గురించి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అమరావతి బోట్ క్లబ్ సీఈవో కాకాని తరుణ్ పాల్గొని గ్రంథాలయ ఉద్యమంలో సేవ చేసినటువంటి మహనీయుల చరిత్రలు అందరూ తెలుసుకోవాలని వారి యొక్క కృషిని మనందరం స్మరించుకోవాలని కోరారు. ఉపన్యాసకులు గుమ్మ సాంబశివరావు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో నిస్వార్థ సేవ చేసిన పాతూరి నాగభూషణం గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను స్థాపించి ఇప్పటివరకు నిరంతరాయంగా నడుపుతున్న గ్రంథాలయ సర్వస్వం ఎంతో మంచి పత్రికగా కొనసాగుతుందన్నారు. గ్రంథాలయ సేవలను ఎంతోమందికి తెలిసేలా చేసిన మహనీయులు నాగభూషణం ఎంతో నిబద్ధతతో గ్రంథాలయాలకు సేవ చేశారని పేర్కొన్నారు. బొడ్డపాటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమ రావు బ్రిటిష్ వారి కాలంలో ఎన్నో ఇబ్బందులు కలిగించిన గ్రంథాలయాల గురించి తన సాహిత్యంలో ఎన్నో వ్యాసాలు రాసి గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయులు అని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమానికి హరి సర్వోత్తమ రావు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కేశవరావు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్ర పితామహులు ఎస్ ఆర్ రంగనాథన్ మొట్టమొదటి లైబ్రేరియన్ గా గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధి కొరకు ఎంతో కృషి చేసినటువంటి గొప్ప మహనీయుడని ఈరోజు మన దేశంలో గ్రంథాలయ వ్యవస్థ నిర్వహణకు విశేష కృషి చేసిన ఎస్ ఆర్ రంగనాథన్ సేవలు మరువలేమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని కే రమాదేవి మరియు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని అతిథులను సన్మానించడం అయినది. మధ్యాహ్నం రెండు గంటలకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి నాగవాణి మాదకద్రవ్యాల నిరోధం గురించి విద్యార్థిని విద్యార్థులకు సలహాలు మరియు సూచనలు ఇవ్వడం అయినది. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు డిబేట్ కార్యక్రమం నిర్వహించబడినది.

# నారాయణ స్కూల్ లో ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు



**మైలవరం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** స్థానిక నారాయణ ఇ-టెక్నో పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ డే వేడుక లు అటహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఏ.జి.యమ్ బసవ రాజు క్రీడా జ్యోతిని వెలిగించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రానించాల ని అన్నారు.ప్రిన్సిపాల్ రత్నకుమారి మాట్లాడుతూ క్రీడలు పిల్లల్లో శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు.ఆటల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ టెక్నో అకడమిక్ డీన్ శ్యామసన్,ఈ చాంప్స్ మనిషా ఈ -కిడ్స్ ఆదిలక్ష్మి ఏ.వో దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి క్షేత్రంలో వైభవంగా అయ్యప్ప స్వామి మండలి పూజలు





**పెడన,నవంబర్ 16 (వార్తాప్రభ) :** పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము లోని శ్రీ హరిహర పుత్ర అయ్యన్ అయ్యప్ప స్వామి వారి ఆలయం నందు మండలి పూజలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొల్లిపర ప్రసాద్ శిరీష కొల్లిపర శ్రీనివాసరావు అన్నపూర్ణ, కొల్లిపర పాండురంగారావు వనిత దంపతులచే శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు శ్రీ అయ్యప్ప స్వామి వారికి 21 రకముల ద్రవ్యములతో అభిషేకములు, ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భవానిలు పాడిన భక్తి పాటల భజన కార్యక్రమం పలువురి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పెడన పట్టణ మండలంలోని కొల్లిపర వంశీయులు ఏర్పాటుచేసిన సద్ది అన్న సమారాధన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భవానీలు భక్తులు 300 మంది శ్రీ స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వారు తమ సేవలను అందించిన ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లిపర వెంకటకృష్ణాంజనేయ గుప్తా పెడన మండల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నాగేశ్వరరావు (నాగయ్య) ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు, కొల్లిపర పూర్ణ ప్రదీప్ గుప్తా కార్యవర్గ సభ్యులు కొల్లిపర సుధాకర్ కొల్లిపర శ్రీనివాసరావు కొల్లిపర పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నారా రామ్మూర్తినాయుడు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసిన కోగంటి బాబు



**కంచికచర్ల,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రామ్మూర్తినాయుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన- కోగంటి ఎన్టీఆర్ జిల్లా నందిగామ కంచికచర్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు , మాజీ శాసనసభ్యులు, పారిశ్రామికవేత్త నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల కంచికచర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు సంతాపం తెలియజేశారు . గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం గుండెపోటుతో మరణించారు . రాంమూర్తి నాయుడు మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు . వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు .

# గ్రామీణ అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**కోడూరు,నవంబర్ 16 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంత అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోడూరు శివారు నరసింహపురం గ్రామంలో ?9,90 లక్షల ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధిని కుంటు పరిచిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉల్లిశేషగిరిరావు, వేములపల్లి శ్రీకృష్ణ, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, వేములపల్లి రాజేష్, యలవర్తి వెంకటేశ్వరరావు,పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్రబాబు, గోగినేని సోమశేఖర రావు మహమ్మద్ ఇమ్రాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు

**ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు**




**హనుమాన్ జంక్షన్, నవంబర్ 16 (వార్తాప్రభ) :** చిత్తూరు జిల్లా చంద్రగిరి మాజీ శాసనసభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి సోదరుడు నారా రామ్మూర్తినాయుడు ఈ రోజు ఉదయం అనారోగ్యంతో హైదరాబాద్ ఏ.ఐ.జి ఆసుపత్రిలో మరణించటం జరిగింది. ఈ రోజు సాయంత్రం కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలోని కమ్యూనిటీ హాల్ లో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి ఆధ్వర్యంలో నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

# వ్యాస రచన పోటీలు.. వక్తృత్వ పోటీలు





**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** షాగులాబ్ చంద్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు చిన్నారుల ఆనందోత్సాహాల మధ్య ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా 3వ రోజైన శనివారం ముఖ్యఅతిధిగా వివేకానంద సేవాసమితి వ్యవస్థాపకులు ఉరిటి రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ మరియు విద్యార్థులతో కలిసి గ్రంథాలయ ఉద్యమ ప్రోత్సాహకులు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. వారోత్సవ కార్యక్రమ పరంపరలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా హాజరైన రామారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతియేటా క్రమం తప్పకుండా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం వాటి ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తాము జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని వయోబేధం లేకుండా గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తకాలను చదివినట్లయితే ఎంతైనా జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

**శాఖ గ్రంధాలయం, రాజేంద్రనగర్ -గుడివాడ.. :** రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలు పేపేటి శాంతి మాట్లాడుతూ విద్యార్థుల రచనావ్యాసాంగాన్ని ప్రోత్సహించేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

**చౌటపల్లి శాఖ గ్రంధాలయం నందు.. :** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలులో భాగంగా మూడు రోజైన శనివారం చౌటుపల్లి శాఖ గ్రంథాలయం నందు 6, 7, 8 తరగతుల విద్యార్థులు చురుగ్గా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని విజయవంతంగా గ్రంథాలయ వారోత్సవాల్లో తమ వంతు పాత్ర పోషించారు. ముఖ్య అతిథిగా శనివారం చౌటపల్లి జడ్ పిహెచ్‌సీ హెచ్.ఎం. రాజా గారు విచ్చేసి.. పద్మశ్రీ గ్రహీత శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు జి.రత్న చంద్ర, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల వెతలు తీరాలి

- సీనియర్ జర్నలిస్ట్ గణపతిరావు పొలమర శెట్టి
- ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



**విజయవాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** దశాబ్దాల కాలంగా నానా అగచాట్లు పడుతున్న పాత్రికేయుల జీవితాల్లో మార్పులు రావడం లేదని, వారి వెతలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు సీనియర్ జర్నలిస్టులు వీర్ల శ్రీరామ్ యాదవ్, గణపతిరావు పొలమ ర శెట్టి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సంపాదకుల సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీరామ్ యాదవ్, గణపతిరావు ను పాత్రికేయులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా రంగం ముఖ్యంగా చిన్న పత్రికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను సోదాహరణంగా వివరించారు. ఈ దుస్థితిని నిలువరించాలంటే ప్రభుత్వాలు సత్వరం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి పత్రికా సంపాదకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూర్మా ప్రసాదబాబు, ప్రధాన కార్యదర్శి ఏ రామ్ మోహన్ రెడ్డి, ఏపి ఎంపీ ఏ నాయకులు నాగోతి శ్రీనివాసరావు, మన్మధ రావు, రాజా, కోటేశ్వరరావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పేద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకసభ్య కమిషన్ జారీ చేయడం శుభ పరిమాణం..

- ఎన్నో ఏళ్ల మా కల నెరవేరింది..
- ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ..



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** ఎస్సీ వర్గీకరణ అమలకు రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం శుభ పరిమాణం అని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక గుడ్ మెన్ పేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల పైగా వర్గీకరణ కోసం చేసిన మా పోరాటాన్ని న్యాయమని గౌరవ న్యాయస్థానం వర్గీకరణ చేయమని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వడం చాలా సంతోషం అన్నారు. 60 రోజుల్లోగా ఈ యొక్క నివేదికను అందించి వర్గీకరణ దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేయాలనీ.. రిజర్వేషన్ ఫలాలను 58 ఉపకులాలకు అందాలనే మా యొక్క న్యాయ పోరాటాన్ని కూటమీ ప్రభుత్వం గుర్తించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా అన్నారు. జిల్లా నాయకులు వెంపటి సైమన్ మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్ నియమించడం చాలా సంతోషమని.. రానున్న 60 రోజుల్లోగా మా యొక్క వర్గీకరణ కల నెరవేరుతుందని ఆశిస్తున్నామని.. కులగణన ఆధారంగా మాకు రావాల్సిన ఫలాలను మాకు ఈ ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేసారు. నాయకులు తాళ్లూరి ప్రశాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విచారణ కమిషన్ చట్టం -1952 ఆధారంగా ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించడం జరిగిందని.. ఈ క్రమంలో 60 రోజుల్లోగా దీనిపై విధివిధానాలను ప్రవేశపెట్టాలని ఆర్డినెన్స్ జారీ చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మా జాతి అభివృద్ధి కోసం మేము చేసిన పోరాటానికి తగిన ప్రతిఫలం అందిందని త్వరలో జరిగే డిఎస్సీ కూడా ఈ వర్గీకరణ ఫలాలను అందించాలని ఈ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం సైమన్ బాబు, అత్తాటి సాల్మన్, పసలాది శేఖర్, అద్దంకి మాణిక్యాలరావు, కొడాలి బాలు, అద్దంకి రాజ్ కుమార్, వేసుపోగు ఇమ్మానుయేలు, వేసుపోగు సాగర్, దొండపాటి మహేష్, ఎందురి కుమార్, మామిళ్ళ ఎలీషా, జువ్వనపుడి నిరంజన్, వేసుపోగు సుందరయ్య, వేసుపోగు సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు నేతృత్వంలో క్రీడాంధ్ర ప్రదేశ్ గా అద్భుతమైన ప్రణాళికలు..

- రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు..




**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** శనివారం రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. పోటీల తదనంతరం ప్రారంభోత్సవం ఉపన్యాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడా ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటానికి అద్భుతమైన ప్రణాళికలు రూపొందించే భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర క్రీడాకారులు ఒలంపిక్స్ క్రీడలను బంగారు పతకం సంపాదిస్తే ఏడు కోట్లు.. వెండి పతకం సంపాదిస్తే ఐదు కోట్లు.. కంచు పతకం సంపాదిస్తే మూడు కోట్ల రూపాయలు ప్రకటించి క్రీడాకారులకు ఎనలేని ఉత్సాహాన్ని నింపారు అని అన్నారు. ఇంకా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము ఒక అద్భుతమైన క్రీడ ప్రణాళికతో త్వరలో మన ముందుకు వస్తున్నారని గుడివాడ మరియు పరిసర ప్రాంత క్రీడాకారులకు ఒక మంచి ప్రోత్సాహం అందించడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిఐఈఓ పీస్ సాల్మన్ రాజు ప్రసంగిస్తూ కరణం మల్లీశ్వరి 2000 సంవత్సరం సిడ్నీ ఒలంపిక్స్ నందు బ్రాంజ్ మెడల్ సంపాదించి భారతదేశ క్రీడా చరిత్రను తిరగరాసింది. ఆమె స్ఫూర్తితో ఈ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అనేకమంది జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తున్నారని.. అలాగే ఈరోజు జరుగుతున్న రాష్ట్ర పోటీల నుంచి కూడా మంచి వెయిట్ లిఫ్టర్స్ రావాలని కోరుతున్నానన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వాహకురాలు రవికాంత, జిల్లా అండర్ 19 ఇయర్స్ సంఘ కార్యదర్శి మడక ప్రసాద్, పి ఈ టి ఎస్ పి ఎస్ స్కూల్ గంటా వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర్ణమితి అసోసియేషన్ అధ్యక్షులు, ఇంటర్నేషనల్ కోచ్ రమేష్, కృష్ణాజిల్లా వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి గుర్రాల రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కే ఎన్ వి నరేంద్ర అలాగే వివిధ జిల్లాల నుంచి వచ్చిన అనేకమంది కోచ్ లు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి ని సత్కరించిన పాత్రికేయులు



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును ఏపియుడబ్ల్యూజే యూనియన్ గుడి వాడ ప్రెస్‌క్లబ్ పాత్రికేయులు ఘనంగా సత్కరించారు. శనివారం స్థానిక ముదినేపల్లి రోడ్డులోని ది కృష్ణావేణి అయిల్ మిల్లులో ఏపియుడబ్ల్యూజే అనుబంధం గుడివాడ ప్రెస్‌క్లబ్ అధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నిమితులైన సందర్భంగా రావి వెంకటేశ్వరరావును దుశాల్వా, పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షా, కార్యదర్శులు గూడపాటి రాజు, మహ్మమద్ జెబివుల్లా, జిల్లా నాయకులు చాత్రగడ్డ విజయ్‌ప్రసాద్, పాత శ్యామ్, గూడపాటి గోపాలకృష్ణ, ఎంఎం ముఖర్జీ, కనపర్తి సురేష్‌బాబు, దండబత్తిన జోషఫ్ తంబి, మాగంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గుడివాడ ఇంఛార్జి శిష్టాను అభినందించిన వడ్డాది..



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శిష్టా దత్తాత్రేయులును నియమించడం అభినందనీయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు వడ్డాది రాజేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అతిధి ఇన్ హోటల్లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన దత్తాత్రేయులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సదర్ల నాగేంద్రతో కలసి రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దత్తాత్రేయులును నియమించి గుడివాడలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చారన్నారు. దత్తాత్రేయులు మాట్లాడుతూ వైఎస్ జగన్ పార్టీ పూర్తిగా ఖాళీ అయిపోయిందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ నాయకులు, వైసీపీ నాయకులు రాజశేఖరరెడ్డి అభిమానులు తిరిగి కాంగ్రెస్ పార్టీకి రావాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెవరెండ్ బర్నబాస్ సజ్జా కు జన్మదిన శుభాకాంక్షలు.. తెలిపిన ఎపి. పి పి ఎఫ్ గుడివాడ దైవ సేవకులు



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ. బర్నబాస్ సజ్జా 72 పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ దైవ సేవకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రా -తెలంగాణలో జి.పి.టి.యం పరిచర్యలు కొనసాగిస్తూ, సామాజిక సేవలో కూడ తమ వంతు సహాయాన్ని ప్రజలకు అందిస్తున్న రెవ. బర్నబాస్ సజ్జా కొరకు దైవ సేవకులు ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎపి పిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.శ్యాంబాబు, పాస్టర్స్ జి.యేహేజ్కేలు, కరుణకుమార్, ఎలీషా, సునీల్ కుమార్, హల్లెలూయ, పలువురు దైవ సేవకులు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సు కూటమి ప్రభుత్వ లక్ష్యం



**కంకిపాడు,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రైతు శ్రేయస్సు లక్ష్యంగా కోటం ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో రైతు సేవ కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని బాలాజీ మిల్లుకు తరలించే కార్యక్రమాన్ని రాజా జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కుటమీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యాన్ని రైతు తనకు నచ్చిన మిల్లుకు రవాణా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రాణి, ఎంపీటీసీ విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు.. నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు - ఎక్సైజ్ సి.ఐ వెంకటరమణ..



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** గుడివాడ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ పరిధిలో ఎక్కడ మద్యం బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సి.ఐ వెంకటరమణ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మద్యం పాలసీ తీసుకువచ్చిందన్నారు. మద్యం షాపుల విషయంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే అన్ని షావులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవి కాకుండా అక్రమంగా మద్యం షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## పాస్టర్ చంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎపి పిపిఎఫ్, గుడివాడ దైవ సేవకులు..



**గుడివాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** పాస్టర్ రత్నకర్ (చంటి) దేవుని సేవకునికి ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ దైవ సేవకులు 49 వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపి తరుపున క్రిస్టియన్ మైనారిటీ సంస్థలో పదవి వరించబోతుందన్న వార్త పలువురు సేవకుల నోట వినికిడి. రానున్న దినాల్లో ప్రభువు పరిచర్య మరింత బలంగా చేయాలని దైవ సేవకులు ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షులు జి.శ్యాంబాబు, ఎపి పిపిఎఫ్ నాయకులు జి.యేహేజ్కేలు, కరుణకుమార్,ఎలీషా, సునీల్ కుమార్, హల్లెలూయ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం జర్నలిస్టులు (జర్నలిజం బేసిక్స్) పుస్తకావిష్కరణ..

- పుస్తకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి



**విజయవాడ,నవంబర్ 16 (వార్తాప్రభ) :** రచయిత సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం రచించిన జర్నలిజం-జర్నలిస్టులు (జర్నలిజం బేసిక్స్) ప్రత్యేక పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ నందు శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ఆవిష్కరించారు. జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర జర్నలిస్టులకు మంత్రి పార్ధసారథి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ జర్నలిస్ట్ రాజారత్నం రచించిన జర్నలిజం జర్నలిస్టులు జర్నలిజం బేసిక్స్ పుస్తకం తనను ఎంతో ఆకట్టుకుందని అన్నారు. అదే విధంగా కొత్తగా జర్నలిజం లోకి ప్రవేశించే యువకులకు ఈ పుస్తకం ఒక దిక్సూచి వలె ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిజంలో బేసిక్స్ నేను కూడా తెలుసుకోవటానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వంలో జరుగుతున్న మంచి చెడులను వివక్షతా రహితంగా ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఎప్పుడైతే జర్నలిస్టు నిజాయితీతో, చిత్తశుద్ధితో ఉంటాడో అప్పుడే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు మనగగలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం, జర్నలిస్టులు మెడకాయల మస్తాన్ రావు,బత్తుల సాంబశివరావు, లోకం చెప్పని నిజం ఎడిటర్ ఎస్.కె రఫీ, తెలుగుదేశం పార్టీ మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, ఈపూరిస్ టీవీ18 డైరెక్టర్ డాక్టర్ ఈపురి శేషగిరి, వినుకొండ నజరేత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రిష్ణ యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు తప్పిన విద్యార్థులకు సువర్ణ అవకాశం

**మైలవరం,నవంబర్ 16 (వార్తాప్రభ) :** క్రిష్ణ యూనివర్సిటీ పరిధిలో చదివిన విద్యార్థులకు మరో సువర్ణ అవకాశం లభించింది. ఈ యూనివర్సిటీ పరిధిలో 2010 నుంచి 2015 విద్యా సంవత్సరాలకు సంబంధించి పరీక్షలు తప్పిన విద్యార్థినీ,విద్యార్థులకు యూనివర్సిటీ వారు చిట్టచివరి అవకాశంగా పరీక్షలు రాయుటకు అవకాశం కల్పించారు. ఎవరైనా తిరిగి పరీక్షలు రాయదలుసుకున్న విద్యార్థులు ఉంటే కళాశాల కార్యాలయంలో సంప్రదించి ఫీజు చెల్లించవచ్చని డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఇల్ల రవి ప్రకటనలో తెలిపారు. నవంబర్ 24వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

## అక్రమ మద్యం స్వాధీనం



**ఆగిరిపల్లి,నవంబర్ 16 (వార్తాప్రభ) :** అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ ఐ కే. శుభ శేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి కి చెందిన సర్నాల పరశు రామయ్య అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేయగా, 11 మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని, పరశురామయ్య ను అరెస్ట్ చేశామన్నారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. ప్రభుత్వం నియమ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే మద్యం బాటిళ్లు కలిగి ఉండాలని, మద్యం బాటిళ్లు అధిక రేట్లకు విక్రయించాలని చూసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు.

### కోర్టు ప్రకటన

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P నెం: 39/2021

బిట్వీన్ :-
1) బేవర శివ
2) బేవర నాగవేణి......పిటీషనర్స్
మరియు
సత్రం రామ్ గోపాల్ మరియు 13 మంది ఇతరులు.........రెస్పాండెంట్స్

16వ రెస్పాండెంట్ :
పిళ్ళా పవన్ కుమార్ తండ్రి: పిళ్ళా శ్రీనివాసరావు, హిందు వయస్సు 25 సం।। నివాసం, డోర్ నెం:6/11-39బి, పిళ్ళా కనకయ్య వీధి, వాగుసెంటరు, విజయవాడ.-1.

17వ రెస్పాండెంట్:-
పిళ్ళా సంపత్ కుమార్ తండ్రి: పిళ్ళా శ్రీనివాసరావు, హిందు వయస్సు 25 సం।। నివాసం, డోర్ నెం:6/11-39బి, పిళ్ళా కనకయ్య వీధి, వాగు సెంటరు, విజయవాడ.-1.

పై నెంబరు I.P లో పిటీషనర్ మీపై దివాలా పిటీషన్ దాఖలు చేయగా మీలో 16వ,17వ రెస్పాండెంట్స్‌కు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకొన కుండా తిప్పిపంపిన కారణం చేత, ఈపేపరు ప్రకటన ద్వారా తెలియజేస్తూ పై రెస్పాండెంట్స్ హాజరు నిమిత్తం ది.04-12-2024నకు వాయిదా వేసినారు. సదరు 16వ,17వ రెస్పాండెంట్స్ మీరు స్వయం గానీ, లేదా మీ తరుపున న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టు వారి ఎదుట ది.04-12-2024 వతేదిన ఉదయం గం।। 10.30ని।।లకు హాజరై తమకు గల అక్షేపణలు తెలుపుకోన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 04-12-2024
ఇట్లు: యం. సురేష్
పిటీషనర్ తరపు న్యాయవాది
రామా నగర్, విజయవాడ-3.

## రాష్ట్రీయ బాల స్వాస్త్య పథకాన్ని సద్వినియోగపరచుకోండి



**కంకిపాడు,నవంబర్ 16 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడులోని అంగన్వాడి సెంటర్ లో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య పథకంలో భాగంగా చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవజాత శిశువుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్నారుల ఎదుగుదలలో లోపాలు, పౌష్టికార లోపాలతో పాటు చిన్నారుల్లో వచ్చే వివిధ వ్యాధులను వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం ద్వారా ముందుగానే గుర్తించి, ఉచితంగా వైద్య చికిత్స సేవలను అందించడానికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అద్భుతమైన పథకం రాష్ట్రీయ బాల స్వాస్థ్య అన్నారు. ఈ పథకం క్రింద 32 రకాల ఆరోగ్యపరమైన లక్షణాల ఆధారంగా చిన్నారుల్లో ఆయా వ్యాధులను గుర్తించి, మందులతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలను కూడా ఉచితంగానే చేస్తారని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్య సిబ్బందితో సహకరించి చిన్నారుల ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు యుతులు శ్రీనివాసరావు , కృష్ణారావు , కమ్యూనిటి హెల్త్ అధికారిణి శ్రీమతి మంజు కంకిపాడు పట్టణ పరిధిలోని అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188